
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





ఆంధ్రా సుగర్స్ రూ.2 కోట్లు విరాళం

కొవ్వూరు, సెప్టెంబర్ 12 : వరద బాధితుల సహాయార్థం ది ఆంధ్రాసుగర్స్ లిమిటెడ్ సంస్థ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2 కోట్ల విరాళం అందజేశారు.ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చుతరామయ్య(అచ్చిబాబు) గురువారం అమరావతిలో సీఎం నారా చంద్రబాబునాయుడిని కలిసి రూ.2 కోట్ల చెక్కు అందించారు. సంస్థ సాయంగా గత వారం వరద బాధితుల సహాయార్థం 10 వేల ఆహార పొట్లాలను పంపిణీ చేశామన్నారు.



ఈయనెవరో గుర్తుపట్టారా.. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు.. ఇటీవల సీఎం సహాయనిధికి నియోజకవర్గ టీడీపీ నాయకులు రూ.58,58,999లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం ఆయన మోకాళ్లపై నిలబడి విరాళం ఇచ్చిన ప్రతి నాయకుడికి ఇలా కృతజ్ఞతలు తెలిపారు.. - నల్లజర్ల



కాకినాడ.. ఏచూరి!




సామర్లకోటలో సీతారాం ఏచూరితో తల్లి కల్పకం (ఫైల్)

- సీతారాంకు కాకినాడతో ఎంతో అనుబంధం
- తల్లిదండ్రులను కలవడానికి పలుసార్లు రాక
- 2010లో సీపీఎం కార్యాలయం ప్రారంభానికి హాజరు
- కడియంలోని జేగురుపాడులో జన్మించిన తల్లి కల్పకం

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారన్న వార్తతో సీపీఎం నేతలు, వారి కుటుంబంతో పరిచయం ఉన్నవారంతా విషాదంలో మునిగిపోయారు. సీతారాంకు కాకినాడతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన తల్లి ఇక్కడే నివాసం ఉండడంతో ఆయన వచ్చి వెళుతుండేవారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



ఏచూరి టవర్స్

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కాకినాడ అంటే చాలా ఇష్టం. ఆయన కుటుంబానికి కాకినాడలో ఏచూరి టవర్స్ పేరుతో ఓ అపార్ట్‌మెంట్ కూడా ఉంది. సీతారాం ఏచూరి తల్లిదండ్రులు కాకినాడలోనే ఉండేవారు. ఆయన తల్లి కల్పకం ఏచూరి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కడియంలోని జేగురుపాడు. అయితే ఉద్యోగ రీత్యా ఆమె కాకినాడలోనే ఉండేవారు.వారు నిర్మించుకున్న ఏచూరి టవర్స్‌లోనే నివాసం ఉండేవారు. సీతారాం తండ్రి కూడా తర్వాత కాకినాడలోనే ఉండేవారు. అయితే కొన్నేళ్ల కిందట వీరు మరణించారు. అయితే తల్లి కోసం పలుమార్లు సీతారాం ఏచూరి కాకినాడకు వచ్చారు. అదే సమయంలో జిల్లా పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. 2010లో కాకినాడలో సీపీఎం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం జరగ్గా, సీతారాం ఏచూరి పాల్గొన్నారు. తల్లి అంటే సీతారాం ఏచూరికి ఎంతో ఇష్టం. ఎక్కడున్నా ఫోన్‌లో తల్లిని పలకరించేవారని జిల్లా పార్టీ నేతలు గుర్తుచేసుకుంటున్నారు. సీతారాం ఏచూరి అందరితో ఆప్యాయంగా మాట్లాడేవారని, కష్టసుఖాలు అడిగేవారని ఆయనతో పనిచేసిన పలువురు జిల్లా నేతలు గుర్తుచేసుకుంటున్నారు. అయితే తల్లి మరణానికి ముందే కాకినాడ కుళాయి చెరువు ఎదురుగా ఉన్న ఏచూరి టవర్స్‌ను విక్రయించేసినట్టు అక్కడ ఉన్న వారు పేర్కొన్నారు. ఏచూరి టవర్స్ పేరుతో ఆయన జ్ఞాపకం మిగిలే ఉంది.

సామర్లకోటలోనూ పరిచయాలు

సామర్లకోట, సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు ఏచూరి కుటుంబ సభ్యులకు సామర్లకోటతో అనుబంధం ఉంది. కంచి మహాసంస్థానం వ్యవస్థాపకులు చంద్రాభట్ల చింతామణి గణపతిశాస్త్రి కుటుంబంతో సీతారాం ఏచూరి తల్లితండ్రులు సోమయాజి ఏచూరి, కల్పకంలకు చిరకాల సాన్నిహిత్యం ఉంది. సీతారాం ఏచూరి తల్లిదండ్రులు గణపతిశాస్త్రి ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అదే సమయంలో సీతారాం మేనమామ విశ్రాంత ఐఏఎస్ అధికారి మోహన్ కందా కూడా తరచూ సామర్లకోటకు రాకపోకలు సాగించేవారు. అప్పుడప్పుడూ వారి వెంట సీతారాం ఏచూరి కూడా తన కుటుంబ సన్నిహితులైన గణపతిశాస్త్రి కుటుంబ సభ్యుల దగ్గరకు వచ్చేవారని చెబుతున్నారు. సీతారాం ఏచూరి మరణం పట్ల కంచిమహా సంస్థానం నిర్వాహకులు చంద్రాభట్ల పతంజలి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందటే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సీతారాం ఏచూరి యోగక్షేమాలు తెలుసుకున్నట్టు చెప్పారు.

తగ్గిన గోదారి

నేడు హెచ్చరికలు ఉపసంహరణ?



అదే జోరు: రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద ఉరకలు పెడుతున్న గోదావరి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : అఖండగోదావరి మహా సము ద్రంలా మారింది. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఇంకా ఉగ్రంగానే ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద రాజమహేంద్రవరం అఖండగోదావరి అతివేగంగా నుర గలు కక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో లంకలన్నీ మునిగిపోయాయి.కొన్ని లంకల్లో చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. సీతానగరం మండలంలోని లంకగ్రామాల ప్రజలు మాత్రం అటూ ఇటూ పడవలమీదే ప్రయణిస్తున్నారు. గోదావరి వరద ప్రవాహం ఎక్కువగా ఉం డడం వల్ల వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలుగుతోంది. పోలీసు, రెవెన్యూమునిసిపల్ శాఖలు భద్రతా చర్యలు పెంచారు. భద్రాచలం వద్ద బుధవారం రాత్రే రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు నీటిమట్టం 43 అడుగులకంటే తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు.సాయంత్రం 6 గంటలకు నిలకడగా ఉంది. దీంతో పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 7 గంటల నుంచి మళ్లీ తగ్గుముఖం పట్టింది.రాత్రి 12 గంటలకు 41 అడుగులకు చేరింది. దీంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు.ఇక ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద తగ్గుముఖం పట్టినా అదే ఉధృతి కొనసాగుతోంది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీ నీటిమట్టం 14.30 అడుగులుగా ఉండగా బ్యారేజి నుంచి 13,63,243 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. రాత్రి 12 గంటలకు నీటిమట్టం 14.10 అడుగులకు చేరింది. 13,17,648 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.ఇది అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి పాయ లు, లంకలు మీదగా సముద్రంలోకి పోతోంది. బ్యారేజీ నీటిమట్టం 13.75 అడుగుల కంటే తగ్గినా, 13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కంటే తగ్గినా రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకుంటారు. తెల్లారేసరికే రెండో ప్రమాద హెచ్చ రిక ఉపసంహరించుకునే అవకాశం ఉంది. శుక్రవారం మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకునే అవకాశం ఉంది. భద్రాచలం ఎగువ భాగంలో లక్ష్మీబ్యారేజీ నుంచి వస్తున్న వరద నీరు పెరిగితే కొద్ది రోజులు గోదావరి ఉగ్రంగానే ఉండే అవకాశం ఉంది.కోనసీమ జిల్లాలోని లంక ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. గోదావరి శాంతించాలని పూజలు చేస్తున్నారు.

గణేశ్ నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి గణేశ్ విగ్రహాల ఊరేగింపు, నిజమజ్జన సమయంలో పోలీస్ నిబంధనలె పాటించకపోతే ఉత్సవ కమిటీ నిర్వాహకులు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. నిమజ్జన ఊరేగింపునకు వెళుతున్న వారి పేర్లు నిర్వాహకుల వద్ద ఉండాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు నిమజ్జనానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కండిషనల్‌లో ఉన్న వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు. రంగులు చల్లడం, బాణసంచా పేల్చడం, మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించి ఊరేగింపులో పాల్గొనడం నిషేధమని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు వలంటీర్లను కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారికి గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ఆగిన చెత్త సేకరణ వాహనాలు

- రూ.46 లక్షల బిల్లులు పెండింగ్
- 82 ప్రైవేట్ వాహనాలు నిలుపుదల
- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిన సేవలు
- 29 వాహనాలతో చెత్త సేకరణ
- రాజమహేంద్రవరంలో అపారిశుధ్యం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 12 : ఇంటింటా చెత్త సేకరణకు బ్రేక్ పడింది. యూజర్ చార్జీలు వసూళ్లను నిలుపుదల చేయడంతో రాజమహేంద్రవరంలో చెత్తసేకరణ వాహనాలు నిలిచిపోయాయి. ఫలితంగా చెత్త పేరుకుపోతుంది. గత ప్రభుత్వం చెత్తపై యూజర్ చార్జీలను వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డోర్ టూ డోర్ చెత్త సేకరణ ఉచితంగానే ప్రజలకు అందించే యోచనలో ఉంది. ఇప్పటికే రాజమహేంద్రవరంతో పాటు అన్ని ప్రధాన నగరాల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరణకు సంబంధించి రాష్ట్రంలో రూ.36 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సదరు చెత్త తరలింపు ప్రైవేట్ వాహనాలు నిలిపివేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రూ.46 లక్షలు చెల్లించాల్సి ఉంది. యూజర్ చార్జీలు నిలిచిపోవడంతో బిల్లులు చెల్లింపులు జర గడంలేదు. ఇంటింటా చెత్త సేకరణకు 29 కార్పొరేషన్ వాహనాలు, 82 ప్రైవేట్ వాహనాలు వినియోగించే వారు. ప్రతిరోజు సగటున 162 మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించే వారు. వీటిలో 82 వాహనాలు ఆగిపోయాయి. కార్పొరేషన్‌కు చెందిన 29 వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 26 సర్కిల్స్ పరిధిలో 50 డివిజన్లలో ఇంటింటా చెత్త సేకణ అంటే కత్తిమీద సాముగా మారింది. యూజర్ చార్జీల విధానం పునరుద్ధరించే అవకాశం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో డోర్‌టూడోర్ చెత్త తరలింపు పనులు నిలిచిపోయినట్టే. గతంలో ఇంటింటా రిక్షా ఉండేది. అలాగే పుష్ కార్టులను తిప్పేవారు. టాటా ఏస్ వాహనాలు తెచ్చాక వాటిని పక్కన పెట్టేశారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసినవి తుప్పుపట్టిపోయాయి. ఇప్పుడు డోర్‌టూ డోర్ వాహనాలు నిలిచిపోవడంతో ఇంటింటా రిక్షాలు, పుష్ కార్టులను అధికారులు తెరపైకి తెస్తున్నారు. దీంతో పారిశుధ్యం మందకొడిగా సాగుతుంది. విధానాలు మార్చిన ప్రతిసారి నగరపాలక సంస్థకు లక్షలాది రూపాయల నష్టం జరుగుతుంది. ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకున్నాక మాత్రమే యాక్షన్‌లోకి రావాలి. రాజమహేంద్రవరంలో ఆకస్మాత్తుగా వాహనాలు నిలిచిపోవడంతో పారిశుధ్య సేవలు సన్నగిల్లాయి.నగరంలో చాలా వరకు చెత్త ను ఇళ్లలో డస్ట్‌బిన్లలో నిల్వ చేసుకున్న ప్రజలు పారిశుధ్యకార్మికులు రాకపోవడంతో రోడ్డుపై పడేస్తున్నారు. నగరంలో పారిశుధ్యం గాడిన పడాలంటే సవాలే.

ఊపిరి తీసిన.. అక్రమ వ్యాపారం!



పన్ను ఎగ్గొట్టేందుకు అడ్డదారులు

- యథేచ్ఛగా జీడిగింజల వ్యాపారం
- కోట్లాది రూపాయల లావాదేవీలు
- పన్ను ఎగ్గొట్టేందుకు ప్రయత్నాలు
- అడ్డదారుల్లో అక్రమంగా తరలింపు
- రూ.2.6 లక్షల కోసం దారి మళ్లింపు
- ఏడుగురిని బలిగొన్న ఘటన అదే
- పేద కుటుంబాలకు దిక్కెవరు
- పట్టని అధికార యంత్రాంగం
- మామూళ్ల మత్తులో జోగుతున్న వైనం
- జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అక్రమార్కులు అడ్డదారుల్లో దోపిడీకి తెగబడుతున్నారు.. పన్నులు ఎగ్గొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అన్నీ తెలిసినా అధికారులు నోరు మూసుకుని కూర్చుకుంటున్నారు..కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారం సాగుతున్నా కనీసం కన్నెత్తి చూడడం లేదు.. తనిఖీలు చేయడంలేదు. కారణమేంటంటే.. మామూళ్లే.. దీనికి జీడిపప్పు వ్యాపారం ఒక ఉదాహరణ మాత్రమే. బుధవారం రాత్రి ఏడుగురిని బలితీసుకున్న ఘటనతో జీడిపప్పు అక్రమ వ్యాపారం బయటపడింది. కేవలం రూ.2.60 లక్షల పన్ను ఎగ్గొట్టడానికి ఏడుగురిని బలితీసుకున్నారు. అయి నా అధికారులు తీసుకున్న చర్యలేం లేవు. దగ్గర ఉండి సెటిల్ చేశారంతే.

ప్రభుత్వ ఖజానాకు గండి..

జీడిపప్పు అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వ ఖజా నాకు గండిపడుతోంది. రూ.కోట్ల ఆదాయం పక్కదారి పడుతోంది. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై అక్రమాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. జిల్లాలో అధికారికంగా 49 జీడిపప్పు ప్రాసెస్ యూనిట్లు ఉన్నాయి. దేవరపల్లి, తాడిమళ్ల, దివాన్‌చెరువు తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. అనధికారి కంగా ఇంకో ఇన్ని ఉంటాయని సమాచారం. జిల్లా వ్యాప్తంగా 12 వేల హెక్టార్లలో జీడిమా మిడి తోటలు ఉన్నాయి. వీటి నుంచి ఏటా సుమారు 40 వేల టన్నుల జీడిపిక్కలు వస్తాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మోరి జీడిపప్పునకు ప్రసిద్ధి. కాకినాడ, అల్లూరు సీతారామరాజు జిల్లాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. రైతుల నుంచి జీడిపిక్కలను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. పన్ను ఎగ్గొట్టేందుకు అక్రమదారులు వెతుకుతారు. ఇతర రాష్ట్రాలకు, ఇతర ప్రాంతాలకు ప్రైవేట్ బస్సుల్లో లగేజీ పేరుతో రవాణా చేస్తుంటారు. దేవరపల్లి, నిడదవోలు, రాజమహే ంద్రవరం తదితర ప్రాంతాల్లో ఇది ఎక్కువ జరుగుతోంది. పోలీసు, రెవెన్యూజీఎస్టీ, మార్కెట్ కమిటీ అధికా రులకు ముడుపులు చెల్లించడం వల్ల అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.గతేడాది జిల్లాలో మార్కెట్ సెస్ కింద కేవలం రూ.34.50 లక్షల ఆదాయం వచ్చింది. ఎస్ జీఎస్టీ కింద సుమారు రూ.2.10 కోట్ల ఆదాయం వచ్చింది. అధికారులు సక్రమంగా దృష్టి పెడితే మరిన్ని కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుంది.



అడ్డదారిలో వచ్చి..

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివారు చిలకావారి పాకల సమీపంలో జీడి పిక్కలతో వస్తున్న డీసీఎంమినీ వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఏడుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు.ఈ ఘటనతో జీడిపిక్కల వ్యాపారుల అక్రమాలు చర్చనీయాంశ అయ్యాయి. ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలంలోని బొర్రం పాలెంనుంచి ఈ జీడిపిక్కల వ్యాన్ తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి వస్తోంది. ఈ వ్యాన్ జంగారెడ్డిగూడెం నుంచి గోపాలపురం మీదుగా దేవరపల్లి , నల్లజర్ల నుంచి తాడిమళ్ల రావడానికి మంచి రహదారి ఉంది. కొయ్యలగూడెం నుంచి నల్లజర్ల మీదుగా రావడానికి రహదా రులు ఉన్నాయి. ఆయా దారుల్లో మార్కెట్ కమిటీ చెక్ పోస్టులు ఉన్నాయి. ఆ సెస్ ఎగ్గొట్టడానికి రాష్ట్ర హైవేలను వదిలేసి, అడ్డదారి ఎన్నుకున్నారు.ఇది చాలాకాలంగా నడుస్తున్నట్టు స్థానిక ప్రజలు చెబుతున్నారు. బొర్రం పాలెం నుంచి ప్రమాదం జరిగిన చిన్నాయిగూడెం చిలకావారి పాకల వద్దకు 35 కిలోమీటర్లు ఉంటుంది. ఇది తోటల మధ్య చిన్నచిన్న ఊర్ల నుంచి ఉన్న రహదారి. జీడిపిక్కలు, జీడిపప్పు వ్యాపారం చేసేవారు మార్కెట్ సెస్సు జీడిపిక్కల బస్తా ధరకు రూ.1 శాతం చెల్లిం చాలి. రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీ ఎస్‌టీ)కింద 18 శాతం చెల్లిం చాలి.ఈ పన్నులు ఎగ్గొట్టడానికి వ్యాపారులు ఇటువంటి అడ్డదారులు తొక్కు తున్నారు.ప్రమాదం జరిగిన రోడ్డు ఓ అడ్డదారే. ఇప్పుడు ఆ ఏడు కుటుంబాలకు దిక్కెవరు.

కేవలం రూ.2.60 లక్షల కోసమే..

డీసీఎం వ్యాన్‌లో 250 బస్తాలు ఉన్నాయి.ఒక్కో బస్తాలో 50 కేజీల జీడిపిక్కలు ఉన్నాయి. బస్తాలు మీద పడడంతో ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు.పన్ను ఎగగొట్టడం కోసమే వ్యాపారులు ఈ దారిని ఎన్నుకున్నారు. ఇక్కడ బస్తా కు 50 కేజీలు ఉన్నా పన్ను విధించేటప్పుడు బస్తాకు 80 కేజీల కింద లెక్కిస్తారు. 80 కేజీల ప్రకారం వ్యాన్‌లో 171.875 బస్తాలు ఉన్నాయి. ప్రస్తుతం బస్తా ధర రూ. 13 వేలు వరకూ ఉంది. దీని ప్రకారం ఒక్కో బస్తాకు మార్కెట్ సెస్ కింద రూ.130 వంతున రూ.22,343 చెల్లిం చాల్సి ఉంది. అంతేకాక జీఎస్‌టీ 18 శాతం కింద ఒక్కో బస్తాకు రూ.1340 మొత్తం రూ.2,30,312 చెల్లించాలి. ఇది ఎగ్గొట్టడం కోసం అడ్డదారిలో వచ్చి ఏడుగురు ప్రాణాలు బలికొన్నారు. పైగా సీజన్‌లో ఈ దారిలో రోజుకు 50 నుం చి 60 వాహనాలు వెళతాయని సమాచారం. ప్రాసెస్ యూనిట్ల వద్ద కేజీ జీడిపప్పు రూ.600 వరకూ ఉంది. మార్కెట్‌లో రూ.800 నుంచి పైకి ఉంటుంది.

వరద బాధితులను ఆదుకోవాలి



ఎకరాకు రూ.25 వేల పరిహారమివ్వాలని డిమాండ్

రాజానగరం, సెప్టెంబరు 12 : ఏలేరు,బుడమేరు వరద బాధితులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఏలేరు ముంపు బాధితులను గురువారం పరామర్శించిన ఆమె మార్గమధ్యలో రాజానగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో భోజన విరామం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏలేరు రిజర్వాయర్ కెనాల్‌ను గతంలో సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నీట మునిగి వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఏలేరు కెనాల్‌కు మరమ్మతులు చేపట్టి ఆధునీకరణ చేయాలని గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే సంకల్పించి శంకుస్థాపన చేసి పనులు ఆరంభించినా ఈ రోజు వరకు పూర్తి కాలేదన్నారు. జగన్ ఐదేళ్లు, చంద్రబాబు పదేళ్లు సీఎంలుగా పనిచేసిన కాలంలో ఏ ఒక్కరూ తట్టెడు మట్టి తీసి పోసిన సందర్భాలు లేవన్నారు.ఒకరి మీద ఒకరు బురద జల్లుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపోయామని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ. 10 వేలు నష్ట పరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. కనీసం రూ.25 వేలు ఇవ్వకపోతే అప్పులు కూడా తీరవన్నారు. గత ప్రభుత్వంలో నష్ట పరిహారం చెల్లించలేదు. ఇప్పుడైనా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, మండల అధ్యక్షుడు ముప్పిడి శ్రీను, కార్యదర్శి అరిగెల అరుణ కుమారి, అమర జహా బేగ్, వైపి వడయార్,జగతాశ్రీను,గరగ శ్రీధర్‌బాబుపాల్గొన్నారు.

అడవిలో చిరుత పులి

వారం రోజులుగా కొనసాగుతున్న వేట

7

సెబ్‌కి బై.. అబ్కారీకి సై

- 7 సెబ్ స్టేషన్లు..ఎక్సయిజ్‌గా మార్పు
- జిల్లా సెబ్‌లో 80 మంది సిబ్బంది
- వీరంతా మళ్లీ మాతృశాఖకు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఆనందం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ.. శాఖలనూ కెలికిపడేసిన విషయం తెలిసిందే.ఈ జాబితాలో అబ్కారీ శాఖ మొదటి వరుసలో ఉంది.ఈ శాఖను కకావికలం చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) అంటూ సొంత లబ్ధి కోసం జగన్ ఓ కొత్త భూతానికి ఊపిరిపోశారు. తమ ఇబ్బందులను ఎక్సైజ్ శాఖ అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా చెవిటి వైసీపీ ప్రభుత్వం చెవికెక్కలేదు. దీంతో ఐదేళ్లపాటు అబ్కారీ ఆవేదనను దిగమింగింది.ఈ బుధవారం నుంచి ఆ బాధకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది.వ్యవస్థలను ప్రక్షాళన చేసే పనిలో భాగంగా సెబ్ రద్దు చేస్తూ ఎక్సైజ్‌ని పునర్వవస్థీకరిస్తూ డీజీపీ, ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి సీహెచ్ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు 12 జీవోలను కూడా వెనక్కు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

మళ్లీ ఎక్సయిజ్ స్టేషన్లు

ఎన్నో ఏళ్ల నుంచీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ విధులు నిర్వర్తిస్తోంది. 2019లో జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఈ శాఖను కకావికలం చేశారు. సొంత లబ్ధి కోసం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో(సెబ్)ని తెరపైకి తెచ్చారు. అబ్కారీ శాఖలోని 70 శాతం మంది సిబ్బందిని సెబ్‌కి కేటాయించి, వారికి బాస్‌గా పోలీసు ఉన్నతాధికారిని నియమించింది. ఎక్సైజ్ శాఖను కేవలం జగన్ నాసిరకం మద్యాన్ని విక్రయించడానికే పరిమితం చేసింది. దీంతో ఎక్సైజ్ శాఖ దాదాపుగా నిర్వీర్యం దశకు వచ్చేసింది. తమ ఇబ్బందులపై అబ్కారీ సిబ్బంది మొత్తుకున్నా వీసమెత్తు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ పిచ్చి పనులకు ఫుల్‌స్టాప్ పెట్టడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా సెబ్‌ని రద్దు చేసి ఎక్సైజ్‌ను పునర్వవస్థీకరిం చాలని గత నెల 28న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.ఇప్పుడు ఆదేశాలు వెలువడ్డాయి. ఎక్సైజ్ సిబ్బందిని వెంటనే ఆ శాఖకు వెనక్కు పంపాలని, సెబ్‌కు చెందిన స్టేషన్లు, ఫర్నిచర్, వాహనాలు, కంప్యూటర్లు, అద్దె భవనాలను అబ్కారీకి అప్పగించాలని, వివిధ కేసుల్లో జప్తు చేసిన వాహనాలు, సామగ్రిని కూడా బదలాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగానే ఎక్సైజ్ సిబ్బందిపై పోలీస్ అజమాయిషీ ఉండదు. ఆ సిబ్బంది అబ్కారీ కమిషనర్ నియంత్రణ, పర్యవేక్షణ పరిధిలోకి వస్తారు. ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.జిల్లాలో రాజమహేంద్రవరంలోని సౌత్, నార్త్, కోరుకొండ, దేవరపల్లి, రంగంపేట, కొవ్వూరు, నిడదవోలులో ఉన్న సెబ్ పోలీస్ స్టేషన్లు ఇకపై ఎక్సైజ్ స్టేష న్లుగా మార్పు చెందనున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి సీఐ వరకూ 80 మంది సెబ్ పరిధిలో ఉన్నారు.మాతృశాఖకు రిపోర్టు చేయాలని జీవో వచ్చిన వెంటనే ఎక్షయిజ్‌కి వెళ్లడానికి ఆ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎక్సైజ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలర్ ఫుల్



గురువారం సూర్యాస్తమయ సమయంలో తూర్పు గోదావరి జిల్లా తీపర్రు వద్ద ఆకాశంలో కనిపించిన సుందర దృశ్యమిది. ఎరుపు, పుసుపు రంగుల మిశ్రమ వర్ణంతో కనిపించగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- పెరవలి



ఒకవైపు గోదావరి వరద... మరోవైపు ఆకాశంలో హరివిల్లు ఛాయ. యానాం రాజీవ్‌గాంధీ బీచ్ రోడ్డులో గురువారం సాయంత్రం 6.20 గంటలకు కనిపించిందీ అందమైన దృశ్యం
- యానాం

ఏఎంవీఐపై హత్యాయత్నం కేసులో నిందితుడికి

పదేళ్ల జైలు శిక్ష

అప్పట్లో సంచలనం సృష్టించిన కేసు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 12: అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.విజయబాబు గురువారం రాత్రి తీర్పు చెపారు. ఈ కేసు అప్పట్లో సంచలనం సృష్టించింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడలో ఏఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.చిన్నారావును 2023 మార్చి 17న స్థానిక దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పక్కనే ఉన్న టాటాఏస్ వాహనం రికార్డును ట్యాబ్‌లో చెక్ చేస్తున్నారు. ఆ వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ లేవని గుర్తించిన ఏఎంవీఐ వాహన యజమానిని రికార్డు చూపించమనగా... ఆపి ఉన్న వాహనానికి రికార్డు చూపించాల్సిన అవసరం లేదని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తి దుర్గాప్రసాద్ బొండాలు నరికే కత్తితో చిన్నారావుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. దీనిపై అప్పటి టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

బావిలోకి దూకి హైస్కూల్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: బావిలోకి దూకి హైస్కూల్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం సాయంత్రం ప్రత్తిపాడులో జరిగింది. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి... ప్రత్తిపాడు హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న బత్తుల దుర్గాభవాని (13) సాయంత్రం హైస్కూల్ నుంచి తిరిగి వస్తూ దారిలో ఉన్న బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన విద్యార్థిని కుటుంబీకులు, గ్రామస్తులు బావి నుంచి బాలికను బయటకు తీసి స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దుర్గాభవానిని ఉదయం మోటారు సైకిలుపై స్కూలు వద్ద వదిలిపెట్టానని, అనంతరం ఊరు వెళ్లి వచ్చేటప్పటికి తన కుమార్తె బావిలో దూకిందని మృతురాలి తండ్రి ఏసుబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె మరణానికి కారణాలపై విచారణ జరపాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట బోదెలోకి ఆటో బోల్తా

డ్రైవరు మృతి



ఉమామహేశ్వరరావు (పాత చిత్రం)

ముమ్మిడివరం, సెప్టెంబరు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ మహిపాలచెరువు నుంచి చిప్పలపాలెం వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఆటో డ్రైవరు మృతి చెందాడు. చిప్పలపాలేనికి చెందిన రమణాతి ఉమామహేశ్వరరావు (40) గురువారం తెల్లవారుజామున మహిపాల చెరువు వెళ్లి తిరిగి వస్తుండగా బొండాయికోడు వద్ద పంట బోదెలో పడింది. దీంతో అతడు మృతి చెందాడు. ఎస్ఐ బి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉమామహేశ్వరరావుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆటో నడపడం ద్వారా వచ్చే సొమ్ములతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉన్న ఒక్క ఆధారం కోల్పోవడంతో వారంతా బోరున విలపిస్తున్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడు మృతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై నరేంద్రగిరి కొండ వద్ద వ్యాన్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.. విశాఖపట్నానికి చెందిన కోర్ని శివ (29) ప్రత్తిపాడు వేగుమ్మ గుడి సమీపంలోని అక్క ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం నరేంద్రగిరి కొండ జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా యర్రవరం నుంచి కత్తిపూడి వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పవన్ కుమార్ చెప్పారు.



పట్టుకున్న రేషన్ బియ్యంతో ఎస్ఐ జగన్మోహన్

8,859 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

తొండంగి, సెప్టెంబరు 12: లారీపై అక్రమంగా తరలిస్తున్న 8,859 కిలోల రేషన్ బియ్యాన్ని తొండంగి ఎస్ఐ జగన్మోహన్ గురువారం తన సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం వేమవరం శివారు రైస్‌మిల్లు వెనుక ప్రాంతంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని లారీపై ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా దాడి జరిపి యాదాల శ్రీను అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్టు ఎస్ఐ జగన్మోహన్ చెప్పారు. దాడిలో ఆర్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వో శేఖర్, ఎంఎస్‌వో పాల్గొన్నారు.



థర్మల్ డ్రోన్‌తో శోధన

- దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే చిరుత పులి
- ట్రాప్ కెమెరాలో గుర్తింపు
- తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి భరణి వెల్లడి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 12: దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో బుధవారం చిరుత పులి కదలిక చిత్రాలు కనిపించాయని, ప్రస్తుతం అది దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి గురువారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. చిరుత పులి పాదముద్రను కనుగొని పగ్ ఇంప్రెషన్ ప్యాడ్‌లు (పీఐపీ) తీసుకున్నామన్నారు. పులి కదలికలను గుర్తించే నిమిత్తం సీసీ కెమెరాలు, ట్రాప్ కెమెరాలను కొన్ని ప్రదేశాల్లో అమర్చామన్నారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అన్ని నివాస ప్రాంతాలను సిబ్బంది క్రమం తప్పకుండా శోధిస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం తీసుకుని వెళ్లి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. ప్రస్తుతం నివాస



ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ లేదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి థర్మల్ డ్రోన్ కెమెరాను ఉపయోగించి శోధన కూడా ప్రారంభించినట్టు తెలిపారు. చిరుతపులి కదలికల కారణంగా దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న రాజమహేంద్రవరంలోని లాలాచెరువు-హౌసింగ్ బోర్డు వద్ద నుంచి ఆటోనగర్ వరకు జాతీయ రహదారిపై వాహనచోదకులు నెమ్మదిగా ప్రయాణించాలని కోరారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయించినట్టు డీఎఫ్‌వో భరణి చెప్పారు.

ఎకరానికి పది కాదు 25వేలు పరిహారం ఇవ్వాలి

- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల
- జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని విమర్శ
- పెద్దాపురంలో నీట మునిగిన పంట పొలాల పరిశీలన

పెద్దాపురం, సెప్టెంబరు 12: ఏలేరు ఆధునికీకరణపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఏలేరు వరద ఉధృతి కారణంగా కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణ శివారులో నీట మునిగిన పంట పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఎకరానికి ఎంత పెట్టుబడి పెట్టారని రైతులను అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఏలేరు వరద రైతులను నిండా ముంచిందన్నారు. రైతులు ఇప్పటికే రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నష్టానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జగన్, చంద్రబాబు తప్పుమీది అంటే మీదని నిందలు వేసుకుంటున్నారని, పదేళ్లుగా ఆధునికీకరణపై ఇద్దరికీ పట్టింపు లేదన్నారు. జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని, డ్యామ్‌లు కొట్టుకుపోతున్నా పట్టింపులేదని, తట్టమట్టి కూడా తీసిన పాపాన పోలేదని విమర్శించారు. చంద్రబాబు ఎకరానికి రూ.10వేలు ఇస్తే సరిపోదని, రూ.25వేలు పరిహారం రైతులకు ఇవ్వాలన్నారు. జగన్ గతంలో రూ.4వేలు పరిహారం ఇచ్చి మోసం చేశారన్నారు. పర్యటనలో కాంగ్రెస్ నాయకులు తుమ్మల దొరబాబు, మాదేపల్లి చిట్టిబాబు, మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, మారోతి గణేష్, నీరుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.



పాత పెద్దాపురంలో వంతెన పైనుంచి ఏలేరు వరద ఉధృతిని చూస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



రైల్వే అధికారులూ ఇది సబబేనా?



ఈ ఫొటోలు చూస్తే వామ్మో.. అనిపిస్తోందా?.. కింద ఉగ్ర గోదావరి, పైన ఫుట్‌పాత్ అంచున పనులు.. కచ్చితంగా గుండె ఝల్లుమంటుంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఈ జీవులు పనిలో నిమగ్నమై వున్నారు. అడుగు తడబడితే బతుకు గోదారిలో కలిసిపోతుంది. కుటుంబం అనాథగా రోడ్డున పడుతుంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు బ్రిడ్జిపై పాత సిమెంట్ రెయిలింగ్ తీసేసి కొత్తగా ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేసే పనులను రైల్వే బ్రిడ్జి విభాగం ఆధ్వర్యంలో చేస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా గోదావరి వరద ఉధృతంగా ఉంది. ఈ నెల 11న రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేశారు. గణేశ నిమజ్జనాలను వాయిదా వేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కానీ ఇవేమీ రైల్వే అధికారులకు కానరాలేదు. ఇన్నాళ్లు వదిలేసి ఇప్పుడే ముహూర్తం అన్నట్టుగా కనీసం రక్షణ చర్యలు తీసుకోకుండా పనులు చేయిస్తున్నారు. సిమెంటు రెయిలింగ్ పిల్లర్లను గ్యాస్ కట్టర్‌తో తొలగించే పనిని ఇద్దరు వ్యక్తులు చేస్తున్నారు. ఏమాత్రం ఆదమరుపుగా అడుగు ముందుకు పడినా, దిమ్మెను గోదావరిలోకి తోసే క్రమంలో తూలినా వారు జలసమాధి కావడం ఖాయం. ఇంతటి ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న వీళ్లను చూస్తూ అటుగా వెళ్లే జనం అయ్యో! అనుకుంటూ.. బడుగు జీవుల బతుకులంటే అంత చులకనా? అంటూ రైల్వే అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

-రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

తగ్గుతున్న ఉధృతి

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 12: గోదావరి ఉధృతి తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం రాత్రి 11 గంటలకు 15.30 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం 8 గంటల పాటు నిలకడగా ఉంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి అత్యధికంగా 15,33,399 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. గురువారం ఉదయం 8 గంటల నుంచి నీటిమట్టంలో తగ్గుదల నమోదయింది. నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం 10గంటల వ్యవధిలో 9 పాయింట్ల మేర తగ్గి సాయంత్రం 6 గంటలకు 14.50 అడుగులకు చేరుకుంది. 13,92,111 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఎగువన భద్రాచలం వద్ద నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం గురువారం సాయంత్రం 6 గంటలకు 41.50 అడుగులుగా నమోదైంది.



హరిహర సదన్ కాటేజీపై సోలార్ ఫలకలు అమర్చుతున్న దృశ్యం

రూ.3.15 కోట్లతో సోలార్ రూఫ్ టాప్

అన్నవరం, సెప్టెంబరు 12: సత్యగిరి కొండపై ఉన్న హరిహర సదన్, శివ సదన్, విష్ణు సదన్ నిర్మాణాలపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు ప్రక్రియను అన్నవరం దేవస్థానం విద్యుత్ విభాగ అధికారులు గురువారం ప్రారంభించారు. దీనికి సుమారు 3.15 కోట్లు వ్యయం కానుండగా ఏడాదికి 9వేల యూనిట్ల విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సత్యగిరిపై రెండు కాటేజీల్లో 272 గదులు, వివాహాలకు 36 హాల్స్ ఉన్నాయి. ఈ పనిని నెడ్‌క్యాప్‌కు అప్పగించనుండగా పదేళ్ల పాటు నిర్వహిస్తుంది. ఐదేళ్లలో దేవస్థానం పెట్టిన పెట్టుబడి సమకూరి అనంతరం విద్యుత్ మిగులులోకి వస్తుందని అధికారులు చెప్పారు.



పవిత్రాలతో ఆలయ అర్చకులు, అధికారులు

అంతర్వేదిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

అంతర్వేది, సెప్టెంబరు 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పవిత్సోతవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి పూజలు జరిపారు. సాయంత్రం ఆరు గంటలకు అంకురారోపణ, అదివాసాలు నిర్వహించారు. దేశ, రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని, స్వామివారికి దివ్యతేజో ప్రకాశాలు, సర్వ ప్రాయశ్చిత్తార్థం నాలుగు రోజుల పాటు పవిత్సోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు.

నేడు మాజీ సీఎం జగన్ పర్యటన

ఏలేరు వరద ముంపు ప్రాంతాల సందర్శన

పిఠాపురం, సెప్టెంబరు 12: ఏలేరు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించేందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం కాకినాడ జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10.30 గంటలకు పిఠాపురం పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి బయల్దేరి పాత ఇసుకపల్లి మీదుగా పిఠాపురం మండలం మాధవపురం చేరుకుంటారు. 11 నుంచి 11.20 గంటల వరకు వరద బాధితులను పరామర్శించి 11.35 గంటలకి కొత్తపల్లి మండలం నాగులాపల్లి చేరుకుని వరద ప్రాంతాలను పరిశీలిస్తారు. 12.10 గంటలకు రమణక్కపేట చేరుకుని వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి 12.45 గంటలకు పిఠాపురంలో హెలిపాడ్ వద్దకు చేరకుని తాడేపల్లి వెళ్తారు. జగన్ పర్యటించే ప్రాంతాలను మాజీ ఎంపీ వంగా గీత గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. పిఠాపురంలోని హెలిపాడ్, మాధవపురం అండర్‌పాస్ బ్రిడ్జి, మాధవపురం గ్రామాల్లో పర్యటించారు.

ఏజెన్సీ సమాచారం



సింగన్నగూడెంలో వరద నీటిలో చిక్కుకున్న లారీ

నెమ్మదిగా తగ్గుతున్న 'శబరి'

చింతూరు, సెప్టెంబరు 12: శబరి నది నెమ్మదిగా తగ్గుతోంది. గురువారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరింది. దీంతో రాకపోకలు సాగే పరిస్థితి లేకుండా పోయింది. మండలంలోని 22 గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మన రాష్ట్రం మీదుగా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే 326, 30 నెంబరు జాతీయ రహదారులు వరద ముంపులోనే ఉన్నాయి. చింతూరుకు చెందిన వరద బాధితుల కోసం ఆదిమగురుకుల కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వారికి అందుతున్న సదుపాయాలను ఐటీడీఏ పీవో అపూర్వభరత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. తమకు శాశ్వత పునరావాసం కల్పించి ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని బాధితులు అధికారులకు మొరపెట్టుకుం టున్నారు. మండలంలో 16 గ్రామాలకు చెందిన వరద బాధితులకు 25 కిలోల వంతున 2,864 కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్టు పీవో అపూర్వభరత్ చెప్పారు.



కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై పోలిపాక వద్ద దెబ్బతిన్న రోడ్డు

వరదలకు రోడ్లు ధ్వంసం

కూనవరం, సెప్టెంబరు 12: ఇటీవల వచ్చిన వరదలకు రోడ్లు చిన్నాభిన్నమయ్యాయి. వరద ఉధృతికి కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారి పోలిపాక వద్ద కొట్టుకుపోగా రాకపోకలు నిలిచిపోయాయి.కూనవరం-టేకులబోరు మధ్య వరద తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. కూనవరం-వీఆర్ పురం మండలాల మధ్య ఉన్న శబరి బ్రిడ్జిపై కూడా వరద తొలగిపోవడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. కొన్ని గిరిజన గ్రామాలకు మాత్రం ఇంకా జలదిగ్బంధంలో ఉన్నాయి. మండల కేంద్రంలోని ఉదయభాస్కర కాలనీకి చెందిన నిర్వాసితులు కోతులగుట్ట పునరావాస కేంద్రంలోనే ఉన్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు శానిటేషన్ పనులు చేస్తున్నారు. మరోవైపు వరదలు, వర్షాలు కారణంగా ఇళ్లకు సంబంధించిన సర్వే గురువారం ప్రారంభమైంది.

పరిహారం ఇవ్వండి: టేకులబోరు వాసుల జల దీక్ష

కూనవరం, సెప్టెంబరు 12: గత కొన్నేళ్లుగా వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ టేకులబోరు గ్రామ చెందిన ప్రజలు గురువారం జలదీక్ష చేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకుని వరద కష్టాల నుంచి గట్టెక్కించాలన్నారు. ప్రతిఏటా వరదల కారణంగా అపార నష్టం జరుగుతోందన్నారు. దీక్షలో లంబు శ్రీను, ఎడ్ల గణేష్, రాంబాబు, వెంకటరావు పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న పీవో

వరద బాధితులకు 'ఏఎస్‌డీఎస్' సాయం

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 12: రేఖపల్లిలోని పునరావాస కేంద్రాల్లో ఉంటున్న ఒడ్డిగూడెం, ధర్మతాళ్లగూడెం వరద బాధిత 125 కుటుంబాలకు ఏఎస్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో పది కిలోల బియ్యం, మూడు కిలోల కందిపప్పు, దుస్తుల కిట్‌లను చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ గురువారం కిట్లను అందించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, వరద బాధితులతో నిర్వహించిన సమావేశంలో పీవో మాట్లాడుతూ వరద బాధితుల సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తానని తెలిపారు. ఈ క్రమంలో రేఖపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యులతో మాట్లాడి సేవలు అందించడంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, తహసీల్దారు సుబ్బారావు, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు, ఎటపాక సీఐ కన్నంరాజు, ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు ఆచంటి శ్రీను, బొర్ర నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి స్వామికి జలాభిషేకం



మోతుగూడెం, సెప్టెంబరు 12: స్థానిక లక్ష్మీగణపతి ఆలయంలో మూలవిరాట్‌కు గురువారం పాలభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించి గరికమాల, నానావిధ పరిమళ పుష్పాలతో మూలవిరాట్‌ను అలంకరించారు. ఉత్సవమూర్తి వద్ద అష్టోత్తర, శతనామ పూజలు జరిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ముఖ్య అతిథులుగా మోతుగూడెం టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, బ్యాంకు మేనేజరు విత్తనాల సత్యనారాయణ దంపతులు, చంద్రశేఖర్ దంపతులు, పీటీ రామారావు దంపతులు, వెంకటేశ్వరరావు దంపతులు, బుజ్జి, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వలసగెడ్డ బ్రిడ్జికి రిపేర్లు



మోతుగూడెం, సెప్టెంబరు 12: ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వై.రామవరం మండలం డొంకరాయి పరిధిలోని వలసగెడ్డ బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రోడ్డుకి గండిపడి అంతర్ రాష్ట్ర రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ కలెక్టర్‌కు సమాచారం ఇవ్వగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశా లిచ్చారు. అయితే ఎంపీటీసీ రమణ మంగళవారం సాయంత్రానికే తాత్కాలిక మరమ్మతుతో ఆటోలు, ద్విచక్రవాహనాల రాకపోకలకు రహదారిని అందుబాటులోకి తీసుకువచ్చారు. మూడు రోజులుగా ఆర్అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో ఎంపీటీసీ పర్యవేక్షణలో యంత్రాల సాయంతో యుద్ధప్రాతిపదికన పనులు సాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి ఆర్టీసీ బస్సులు కూడా నడిచేలా రోడ్డును అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులు చేస్తున్నారు. ఆర్అండ్‌బీ ఈఈ, రంపచోడవరం ఆర్అండ్‌బీ డీఈ బృందం దగ్గరుండి పనుల నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు.

19న రేలంగి కాంస్య విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 12: రాజమహేంద్రవఱం గోదావరి గట్టుపై ఈ నెల 19వ తేదీన హాస్య నటచక్రవర్తి రేలంగి వెంకట్రామయ్య కాంస్య విగ్రహావిష్కరణ చేస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌కు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎస్పీని కలిసిన వారిలో కొండేటి భీమారావు, మార్గాని చంటిబాబు, అత్తిలి రాజు, ఒనుము శ్రీను, బొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛతా హి సేవా -2024

కలెక్టర్ ప్రశాంతి.. క్యాంప్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 12 : మూడు కీలక అంశాలతో ఈనెల 17 నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు ప్రజల్లోకి వెళుతున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం స్వచ్ఛతా హి సేవా-2024 గోడపత్రులను ఆవిష్కరించారు. నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని స్వచ్ఛతా హి సేవా -2024 అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్, డీపీవో డి.రాంబాబు, సీపీవోఎల్ అప్పలకొండ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకరరావు, డీఎంహెచ్‌వో కే.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 1 నుంచి పోషణ్ ప్లస్ కార్యక్రమం

కౌమార దశలో ఆడపిల్లల్లో రక్తహీనత తలెత్తకుండా పోషణ్ ప్లస్ కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 1నుంచి మునగాకు పొడి పంపిణీ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఎనీమియా లోపం వల్ల రక్తహీనత కలిగి కళ్లు తిరిగి పడిపోవడం వంటివి జరుగుతుంటాయన్నారు. మనం తీసుకునే ఆహారంలో ఐరన్ పోషకాలు అందుతున్నాయో లేదా నిర్ధారించుకోవాలన్నారు. జిల్లాలో తొలివిడతగా 2700 మంది హాస్టల్ విద్యార్థినులకు మునగాకు పొడి అందచేసి మంచి ఫలితాలు సాధించామన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సుమారు 3 వేల మంది కౌమార దశలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.వసుంధర, డీఎంహెచ్‌వో డాక్టర్ కే.వెంకటేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్.జ్యోతి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎమ్.సందీప్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట, సెప్టెంబరు 12: రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో జె.జెస్సీఫ్లోరెన్స్ గురువారం తెలిపారు. బిక్కవోలు మండలంలో కాపవరం-2లో అంగన్‌వాడీ కార్యకర్తకు, కొమరిపాలెంలోని రామన్నపేట, ఆరికరేవులలోని వెలమపేట, కొమరిపాలెం, బలభద్రపురం(ఎస్సీ ఏరియా), చంద్రేడు-1, కుతుకులూరు-3లలో అంగన్‌వాడీ సహాయకుల ఖాళీలు ఉన్నాయని, ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన, మరిన్ని వివరాలకు రంగంపేటలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కోరుకొండ: కోరుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో ఖాళీలను సీడీపీవో కె.ఝాన్సీ ప్రకటించారు. గాదెలపాలెం మినీ కార్యకర్త 1(ఓసీ) ఖాళీ ఉండగా, గుమ్మళ్ళదొడ్డి-1(బీసీ-ఏ), గోకవరం-5 (ఓసీ), సూదికొండ (ఎస్సీ), ఠాగూర్‌పాలెం (ఓసీ), కామరాజుపేట-5 (బీసీ-డీ), కోరుకొండ మండలం గాదరాడ-2(ఎస్సీ), కణుపూరు-5(బీసీ), కోటి -2(ఓసీ), బూరుగుపూడి-1(ఎస్సీ), నర్సాపురం-1(ఓసీ),రఘుదేవపురం-2(ఓసీ)లలో సహాయకురాళ్ల ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోరుకొండ ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తులో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ జిరాక్స్‌లు జత చేయాలన్నారు.

ఎంపీ పురందేశ్వరిపై దుష్ప్రచారం తగదు

బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏపీఆర్ చౌదరి

కోరుకొండ, సెప్టెంబరు 12: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిపై ఒక ప్రముఖ టీవీ ఛానల్‌లో తప్పుడు కథనాన్ని ప్రచారం చేశారని దాన్ని పూర్తిగా తమ పార్టీ ఖండిస్తోందని రాష్ట్ర నాయకుడు ఏపీఆర్ చౌదరి పేర్కొన్నారు. కోరుకొండ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పురందేశ్వరి ఎంపీ అయ్యాక రాజమహేంద్రవరం నియోజకవర్గానికి అతిథిగా వచ్చి వెళుతున్నారే తప్ప అభివృద్ధి పట్ల శ్రద్ధ చూపడం లేదంటూ వచ్చిన టీవీ కథనాన్ని ఆయన ఖండించారు. అది పూర్తిగా అవాస్తవమన్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధికి సంబంధించి కేంద్ర రైల్వే మంత్రి శాఖతో ఆమె అనేక సార్లు చర్చించారని, స్థానిక పేపర్ మిల్లు యాజమాన్యంతో మాట్లాడి ఉద్యోగులకు న్యాయం జరిగేలా ఆమె చూశారన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎక్కువగా నిధులు తీసుకొచ్చేందుకు ఎంపీ ప్రయత్నిస్తున్నారని ఆమెపై తప్పుడు కథనాలు ప్రచారం చేయడం తగదన్నారు. సమావేశంలో మద్దిపాటి రజని, పచ్చారి నరసింహమూర్తి, పెనకటి రాంబాబు, తగరంపూడి గణపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

అనపర్తి/పెదపూడి,సెప్టెంబరు 12: పెదపూడి మండలం గొల్లల మామిడాడలో గురువారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 20కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు బీజేపీలో చేరి సభ్యత్వం తీసుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో శివరామకృష్ణంరాజు, హరి నారాయణరెడ్డి, సత్యనారాయణ, కర్రి బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'తో అనాథలకు చేయూత

అనపర్తి, సెప్టెంబరు 12: తల్లిదండ్రులను కోల్పోయి బంధువుల సంరక్షణలో పెరుగుతున్న చిన్నారులకు చేయూతను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకాన్ని రూపొందించిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ పథకం ద్వారా అనపర్తి మండలంలో మంజూరైన చిన్నారులకు మంజూరు పత్రాలను గురువారం రామవరంలో ఆయన అందజేశారు. ఈ పథకం ద్వారా ఆరు నెలలకు సంబంధించి రూ.24 వేలు కేంద్రం చిన్నారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేసిందని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్రి చిన్నారెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు పీహెచ్‌సీ వైద్యుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 12 : పీహెచ్‌సీ వైద్యులకు నష్టం చేకూర్చేవిధంగా ఉన్న జీవో నెం.85ను రద్దు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. ఈ మేరకు గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు పీహెచ్‌సీ వైద్యులు మాట్లాడుతూ తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేదిలేదని స్పష్టంచేశారు.తమ సమస్యలపై ప్రభుత్వం చర్చలకు పిలవకపోతే ఈ నెల 13న అత్యవసర సర్వీసులను మినహాయించి అన్ని రిపోర్టింగ్‌లు, వీసీ, టీసీ, అధికారిక కమ్యూనికేషన్లు నిలిపివేస్తామని జిల్లా అధ్యక్షురాలు మౌనిక తెలిపారు.

మేయర్‌గా పోటీ చేస్తా: గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 12: రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మేయర్‌గా తాను పోటీ చేస్తానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ఆయన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘకాలంపాటు టీడీపీలో పని చేసిన తాను ఎన్నడూ ప్రత్యేకంగా ఎన్నికల్లో పాల్గొనలేదని చెప్పారు. ఈ సారి నగరపాలక సంస్థ ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సీఎం చంద్రబాబును కావాలనే వైసీపీ ఎమ్మెల్యే జగన్ బురద జల్లుతున్నాడని మండిపడ్డారు. జగన్‌కు భవిష్యత్‌లో ఒక సీటు కూడా రాదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మళ్ళ వెంకట్రాజు ,వానపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ పర్యటించి 80 ఏళ్లు'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 12 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రాజమహేంద్రవరం వచ్చి 80 ఏళ్ళు పూర్తయిందని.. ఇది తమకు గర్వకారణమని ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఈనెల 28న నిర్వహించే కార్యక్రమాల కరపత్రాన్ని సంఘం నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్ళూరి బాబు రాజేంద్ర ప్రసాద్, కప్పల వెలుగు కుమారి ఆవిష్కరించారు. 1944 సెప్టెంబరు 28న అంబేడ్కర్ బ్రిటీష్ కౌన్సిల్ మెంబరు (కార్మిక శాఖ) హోదాలో రాజమండ్రిలో పర్యటించారని చెప్పారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 12: అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. 44వ డివిజన్ మల్లికార్జుననగర్‌లో వైఎంసీఏ హాలు వెనుక ప్రాంతంలో గురువారం ఉదయం టేకు మహాలక్ష్మి ఇల్లు అగ్నికి ఆహుతైంది. దీంతో ఆమె నిరాశ్రయురాలై రోడ్డున పడింది. టీడీపీ నాయకుడు వంజరపు శంకర్ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితురాలికి ధైర్యం చెప్పి నిత్యావసరాలు అందించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

సీతారాం లేరంటే నమ్మలేకపోతున్నా..: గోరంట్ల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు జీవితాన్ని దారపోసిన నేత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని, ఆయన మరణం సమాజానికి తీరని లోటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పుట్టి, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగి, పార్లమెంట్‌లో తన గొంతు వినిపించి అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాడినేత అన్నారు. నీతి నిజాయితీలకు మారుపేరుగా బతికిన సీతారాం ఏచూరి ఇక లేరంటే నమ్మకలేకపోతున్నానన్నారు.

ముగ్గురు జాతీయ క్రీడాకారులకు సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 12: అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడాకారుడు దివంగత సుంకర భాస్కరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. సుంకర భాస్కరరావు క్రీడా పరిశోధనాభివృద్ధి కేంద్రం, సుంకర భాస్కరరావు ఫుట్‌బాల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గురు జాతీయ క్రీడాకారులను సత్కరించారు. స్థానిక సుంకర భాస్కరరావు మునిసిపల్ స్కూల్లో గురువారం కేలం శ్రీనివాసరావు (ఫుట్‌బాల్), పీవీఎస్ఎస్ దొరబాబు (షటిల్ బ్యాడ్మింటన్), ఏవీడీ ప్రసాద్ (కబడ్డీ)లను సత్కరించారు. వీరికి సుంకర భాస్కరరావు స్మారక క్రీడా ప్రతిభావంతులు, క్రీడా శ్రేష్ఠుల పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో వర్రే శ్రీనివాసరావు, హెచ్ఎం రొబ్బి సన్యాసిరావు, రాజ్‌కుమార్ బాబు, సీరా గంగాధర్, సుంకర నాగేంద్ర కిషోర్, ఉమారాణి పాల్గొన్నారు.

రాజానగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు సన్నాహాలు

» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, సెప్టెంబరు 12: నియోజకవర్గం కేంద్రమైన రాజానగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసే యోచన ఉందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఇందుకు స్థానిక హైస్కూల్ ప్రాంగణంలోని అనువైన భవనాలను సంబంధిత అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుపై జూలై నెలలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించి నియోజకవర్గంలో ఈ విద్యా సంవత్సరం నుంచే పాలిటెక్నిక్ విద్యనందించే దిశగా పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేశారన్నారు. త్వరగా కళాశాల ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామ న్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, ఏయూ రీజి యన్ ఆర్‌జేడీ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ టి.జగదీష్‌బాబు, తహశీల్దార్ ఎన్.లక్ష్మీలావణ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, నాయకులు వేగిశెట్టి రాజు, కిమిడి శ్రీరామ్, తోట రామకృష్ణ, గళ్లా రంగ పాల్గొన్నారు.

గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల

కడియం, సెప్టెంబరు 12: కడియం దేవీచౌక్ సెంటర్‌లో శ్రీదుర్గాదేవి గూడ్స్ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని గురువారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ముద్రగడ జమీ, వెలుగుబంటి నాని, గట్టి నర్సయ్య, పాటంశెట్టి రాంజీ, చెక్కపల్లి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి

బిక్కవోలు, సెప్టెంబరు 12: వినాయక నిమజ్జనం, ఊరేగింపు సమయాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ మండలంలోని ఉత్సవ కమిటీలకు సూచించారు. కొంకుదురు మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని ఆయన గురువారం దర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన క్యూఆర్ కోడ్‌ని చెక్‌చేసి వాటికి అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను కమిటీ సత్కరించింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉత్సవాలు ముగింపు సమయంలో ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా విగ్రహాల నిమజ్జనం, ఊరేగింపులు నిర్వహించుకోవాలన్నారు. రంగులు చల్లడం, బాణసంచా కాల్పులు, అశ్లీల వేషధారణలు చేయరాదని చెప్పారు. నిమజ్జనం విగ్రహాలను అధికారులు నియమించిన వలంటీర్లు, స్విమ్మర్లతో చేయించాలన్నారు. కార్యక్రమంలలో ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్నం వీరభద్రారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

కడియం, సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం కడియం పలువురు విరాళాలను గురువారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అందించారు. కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి వెంకటరామారావు(రాంజీ) రూ.లక్ష, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, మార్గాని వీరబాబు రూ.లక్ష, కడియపుసావరం సర్పంచ్ చెక్కపల్లి మురళి, కడియపుసావరం కూటమి నాయకులు రూ.లక్ష చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు.

సీతానగరం: విజయవాడ వరద బాధితుల కోసం సీతానగరం బ్రాహ్మణ సంఘం రూ.65,000 చెక్కును ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు అందజేసారు. గురువారం ఆయనను రఘుదేవపురంలోని పార్టీ కార్యాలయంలో కలసిన బ్రాహ్మణ సంఘం సభ్యులు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతలూరి రంగారావు, ఆరాధ్యుల నరేంద్ర, దుళ్ల సూర్యనారాయణ, ములగాల రామకృష్ణ కూటమి నాయకులు పాల్గొన్నారు,

రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు అనపర్తి విద్యార్థినుల ఎంపిక

అనపర్తి, సెప్టెంబరు 12: అనపర్తిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం కె.కళ్యాణి తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరచిన తొమ్మిదో తరగతి చదువుతున్న బి.అంకిత, టి.వినీల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 14నుంచి 16వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థినులను పీడీ ఎ.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

21న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం వార్షిక మహాసభలు: రాంబాబు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 12: జీవిత బీమా ఉద్యోగుల సంఘం 27వ వార్షిక మహాసభలు సెప్టెంబరు 21వ తేదీన నిర్వహిస్తామని రాజమండ్రి మోడల్ కాలనీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు గుబ్బల రాంబాబు,ఎం.కోదండరామ్ తెలిపారు. మోరంపూడిలోని జీవిత బీమా సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో గురువారం 27వ వార్షిక మహాసభల పోస్టరును ఆవిష్కరించి మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని 20 శాఖా కార్యాలయాల్లోని ఉద్యోగులు పెద్ద ఎత్తున సమావేశంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్ఆర్‌జె మాథ్యూస్, జి.శ్రీనివాస్, బత్తుల భరణి, తాతేశ్వర్, ఏ.సుబ్బారావు, ఎస్.గన్నయ్య, ఈశ్వరరావు, ఏకె.విశ్వనాథ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వైర్‌ల దొంగలు అరెస్టు

40 కిలోల రాగి వైరు రికవరీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న అపార్టు మెంట్లు తదితర ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ వైర్ల దొంగతానికి పాల్పడుతున్న యువకులను అరెస్టు చేశామని టూటౌన్ సీఐ వి.దుర్గారావు తెలిపారు. రైల్వే మెము కార్ షెడ్‌లో ఎలక్ట్రికల్ వైరు దొంగతనం చేసిన కేసులో కోటిలింగాల పేటకు చెందిన మణికంఠ రాజు, కుసుమ శశాంత్(మున్న), ఆవ రోడ్డు వాంబే కాలనీకి చెందిన కుక్కల చిన్నిని అదుపులోకి తీసుకొని 40 కిలోల రాగి వైరు రికవరీ చేశామన్నారు. వీళ్లతో పాటు చోరీలకు పాల్పడిన పేపరు మిల్లు సమీపంలోని వాంబే కాలనీకి చెందిన షేక్ కరీం, బొల్లంకల శ్రీనివాస్, గుంజే వెంకటేశ్, కోటిలింగాల పేటకు చెందిన సారిక రోహిత్‌లు గంజాయి కేసులో ఇప్పటికే జైలులో ఉన్నారని చెప్పారు. కోటిలింగాల పేటకు చెందిన మోత శ్రీరామ్(బబ్లూ) పరారీలో ఉన్నాడన్నారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ వి.దుర్గారావు, ఎస్ఐ బి.వినోద్, హెచ్‌సీ ఎస్.రాజశేఖర్, క్రైమ్ పీసీలు ఎస్.వీరబాబు, ఎస్‌కే కరీంబాషాలను ఎస్పీ కిశోర్ అభినందించారు.

ఆటోనగర్‌లో లారీ మెకానిక్ మృతి

రాజానగరం, సెప్టెంబరు 12: రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో గురువారం జరిగిన ప్రమాదంలో లారీ మెకానిక్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కడియం మండలం వేమగిరికి చెందిన రుత్తాల నాగేశ్వరరావు(42) ఆటోనగర్‌లో లారీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక గణేష్ హైడ్రాలిక్ షెడ్డు పక్కన ఒక లారీకి వెనుక భాగంలో మరమ్మతు పనులు చేస్తుండగా, మరో లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా వెనక్కి నడుపుతూ మరమ్మతులు చేస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రెండు లారీల మధ్య చిక్కుకున్న మెకానిక్ నాగేశ్వరరావు నుజ్జునుజ్జు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు క్షతగాత్రుడిని పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. కాగా నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు మణికుమార్ ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.


సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

గోకవరం, సెప్టెంబరు 12: మండలంలోని రంపయర్రంపాలెం గ్రామశివారున సారా విక్రయిస్తున్న చాకలి మంగను గురువారం అరెస్ట్ చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ అబ్బులుదొర తెలిపారు. ఆమె నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితురాలిని రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు12 : జాతీయ రహదారిపై ఆటోనగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. బొమ్మూరు ఎస్.ఐ ఎస్‌పీ కుమార్ వివరాల ప్రకారం.. కడియం మండలం వేమగిరికి చెందిన నడిమంటి సింహాద్రి(68), ఎడ్ల వెంకటగిరి బైక్‌పై శుక్రవారం రాజానగరం వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వెంకటగిరికి స్వల్పగాయాలు కాగా వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న సింహాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సింహాద్రి గురువారం సాయంత్రం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. కాగా సింహాద్రి తాపీపని చేస్తుంటాడని అన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



ఆంధ్రా సుగర్స్ రూ.2 కోట్లు విరాళం

కొవ్వూరు, సెప్టెంబర్ 12 : వరద బాధితుల సహాయార్థం ది ఆంధ్రాసుగర్స్ లిమిటెడ్ సంస్థ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2 కోట్ల విరాళం అందజేశారు.ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చుతరామయ్య(అచ్చిబాబు) గురువారం అమరావతిలో సీఎం నారా చంద్రబాబునాయుడిని కలిసి రూ.2 కోట్ల చెక్కు అందించారు. సంస్థ సాయంగా గత వారం వరద బాధితుల సహాయార్థం 10 వేల ఆహార పొట్లాలను పంపిణీ చేశామన్నారు.



తగ్గిన గోదారి

నేడు హెచ్చరికలు ఉపసంహరణ?



అదే జోరు: రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద ఉరకలు పెడుతున్న గోదావరి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి) : అఖండగోదావరి మహా సముద్రంలా మారింది. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ ఇంకా ఉగ్రంగానే ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద రాజమహేంద్రవరం అఖండగోదావరి అతివేగంగా నుర గలు కక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో లంకలన్నీ మునిగిపోయాయి.కొన్ని లంకల్లో చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. సీతానగరం మండలంలోని లంకగ్రామాల ప్రజలు మాత్రం అటూ ఇటూ పడవలమీదే ప్రయణిస్తున్నారు. గోదావరి వరద ప్రవాహం ఎక్కువగా ఉం డడం వల్ల వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలుగుతోంది. పోలీసు, రెవెన్యూమునిసిపల్ శాఖలు భద్రతా చర్యలు పెంచారు. భద్రాచలం వద్ద బుధవారం రాత్రే రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు నీటిమట్టం 43 అడుగులకంటే తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు.సాయంత్రం 6 గంటలకు నిలకడగా ఉంది. దీంతో పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 7 గంటల నుంచి మళ్లీ తగ్గుముఖం పట్టింది.రాత్రి 12 గంటలకు 41 అడుగులకు చేరింది. దీంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు.ఇక ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద తగ్గుముఖం పట్టినా అదే ఉధృతి కొనసాగుతోంది. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ప్రస్తుతం బ్యారేజీ నీటి మట్టం 14.30 అడుగులుగా ఉండగా బ్యారేజి నుంచి 13,63,243 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. రాత్రి 12 గంటలకు నీటిమట్టం 14.10 అడుగులకు చేరింది. 13,17,648 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.ఇది అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి పాయ లు, లంకలు మీదగా సముద్రంలోకి పోతోంది. బ్యారేజీ నీటిమట్టం 13.75 అడుగుల కంటే తగ్గినా, 13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కంటే తగ్గినా రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకుంటారు. తెల్లారేసరికే రెండో ప్రమాద హెచ్చ రిక ఉపసంహరించుకునే అవకాశం ఉంది. శుక్రవారం మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకునే అవకాశం ఉంది. భద్రాచలం ఎగువ భాగంలో లక్ష్మీబ్యారేజీ నుంచి వస్తున్న వరద నీరు పెరిగితే కొద్ది రోజులు గోదావరి ఉగ్రంగానే ఉండే అవకాశం ఉంది.కోనసీమ జిల్లాలోని లంక ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. గోదావరి శాంతించాలని పూజలు చేస్తున్నారు.

గణేశ్ నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన సమయంలో పోలీస్ నిబంధనలు పాటించకపోతే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదన్నారు. నిమజ్జన ఊరేగింపునకు వెళుతున్న వారి పేర్లు నిర్వాహకుల వద్ద ఉండాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు నిమజ్జనానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కండిషనల్‌లో ఉన్న వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు. రంగులు చల్లడం, బాణసంచా పేల్చడం, మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించి ఊరేగింపులో పాల్గొనడం నిషేధమని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు వలంటీర్లను కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారికి గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

ఈయనెవరో గుర్తుపట్టారా.. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు.. ఇటీవల సీఎం సహాయనిధికి నియోజకవర్గ టీడీపీ నాయకులు రూ.58,58,999లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం ఆయన మోకాళ్లపై నిలబడి విరాళం ఇచ్చిన ప్రతి నాయకుడికి ఇలా కృతజ్ఞతలు తెలిపారు.. - నల్లజర్ల





కాకినాడ.. ఏచూరి!




సామర్లకోటలో సీతారాం ఏచూరితో తల్లి కల్పకం (ఫైల్)

- సీతారాంకు కాకినాడతో ఎంతో అనుబంధం
- తల్లిదండ్రులను కలవడానికి పలుసార్లు రాక
- 2010లో సీపీఎం కార్యాలయం ప్రారంభానికి హాజరు
- కడియంలోని జేగురుపాడులో జన్మించిన తల్లి కల్పకం

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారన్న వార్తతో సీపీఎం నేతలు, వారి కుటుంబంతో పరిచయం ఉన్నవారంతా విషాదంలో మునిగిపోయారు. సీతారాంకు కాకినాడతో ఎంతో అనుబంధం ఉంది. ఆయన తల్లి ఇక్కడే నివాసం ఉండడంతో ఆయన వచ్చి వెళుతుండేవారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)



ఏచూరి టవర్స్

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి కాకినాడ అంటే చాలా ఇష్టం. ఆయన కుటుంబానికి కాకినాడలో ఏచూరి టవర్స్ పేరుతో ఓ అపార్ట్‌మెంట్ కూడా ఉంది. సీతారాం ఏచూరి తల్లిదండ్రులు కాకినాడలోనే ఉండేవారు. ఆయన తల్లి కల్పకం ఏచూరి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కడియంలోని జేగురుపాడు. అయితే ఉద్యోగ రీత్యా ఆమె కాకినాడలోనే ఉండేవారు.వారు నిర్మించుకున్న ఏచూరి టవర్స్‌లోనే నివాసం ఉండేవారు. సీతారాం తండ్రి కూడా తర్వాత కాకినాడలోనే ఉండేవారు. అయితే కొన్నేళ్ల కిందట వీరు మరణించారు. అయితే తల్లి కోసం పలుమార్లు సీతారాం ఏచూరి కాకినాడకు వచ్చారు. అదే సమయంలో జిల్లా పార్టీ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. 2010లో కాకినాడలో సీపీఎం జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం జరగ్గా, సీతారాం ఏచూరి పాల్గొన్నారు. తల్లి అంటే సీతారాం ఏచూరికి ఎంతో ఇష్టం. ఎక్కడున్నా ఫోన్‌లో తల్లిని పలకరించేవారని జిల్లా పార్టీ నేతలు గుర్తుచేసుకుంటున్నారు. సీతారాం ఏచూరి అందరితో ఆప్యాయంగా మాట్లాడేవారని, కష్టసుఖాలు అడిగేవారని ఆయనతో పనిచేసిన పలువురు జిల్లా నేతలు గుర్తుచేసుకుంటున్నారు. అయితే తల్లి మరణానికి ముందే కాకినాడ కుళాయి చెరువు ఎదురుగా ఉన్న ఏచూరి టవర్స్‌ను విక్రయించేసినట్టు అక్కడ ఉన్న వారు పేర్కొన్నారు. ఏచూరి టవర్స్ పేరుతో ఆయన జ్ఞాపకం మిగిలే ఉంది.

సామర్లకోటలోనూ పరిచయాలు

సామర్లకోట, సెప్టెంబరు 12 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు ఏచూరి కుటుంబ సభ్యులకు సామర్లకోటతో అనుబంధం ఉంది. కంచి మహాసంస్థానం వ్యవస్థాపకులు చంద్రాభట్ల చింతామణి గణపతిశాస్త్రి కుటుంబంతో సీతారాం ఏచూరి తల్లితండ్రులు సోమయాజి ఏచూరి, కల్పకంలకు చిరకాల సాన్నిహిత్యం ఉంది. సీతారాం ఏచూరి తల్లిదండ్రులు గణపతిశాస్త్రి ఆధ్వర్యంలో జరిగే అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అదే సమయంలో సీతారాం మేనమామ విశ్రాంత ఐఏఎస్ అధికారి మోహన్ కందా కూడా తరచూ సామర్లకోటకు రాకపోకలు సాగించేవారు. అప్పుడప్పుడూ వారి వెంట సీతారాం ఏచూరి కూడా తన కుటుంబ సన్నిహితులైన గణపతిశాస్త్రి కుటుంబ సభ్యుల దగ్గరకు వచ్చేవారని చెబుతున్నారు. సీతారాం ఏచూరి మరణం పట్ల కంచిమహా సంస్థానం నిర్వాహకులు చంద్రాభట్ల పతంజలి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందటే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సీతారాం ఏచూరి యోగక్షేమాలు తెలుసుకున్నట్టు చెప్పారు.

ఊపిరి తీసిన.. అక్రమ వ్యాపారం!

పన్ను ఎగ్గొట్టేందుకు అడ్డదారులు





(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అక్రమార్కులు అడ్డదారుల్లో దోపిడీకి తెగబడుతున్నారు.. పన్నులు ఎగ్గొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అన్నీ తెలిసినా అధికారులు నోరు మూసుకుని కూర్చుకుంటున్నారు..కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారం సాగుతున్నా కనీసం కన్నెత్తి చూడడం లేదు.. తనిఖీలు చేయడంలేదు. కారణమేంటంటే.. మామూళ్లే.. దీనికి జీడిపప్పు వ్యాపారం ఒక ఉదాహరణ మాత్రమే. బుధవారం రాత్రి ఏడుగురిని బలితీసుకున్న ఘటనతో జీడిపప్పు అక్రమ వ్యాపారం బయటపడింది. కేవలం రూ.2.60 లక్షల పన్ను ఎగ్గొట్టడానికి ఏడుగురిని బలితీసుకున్నారు. అయి నా అధికారులు తీసుకున్న చర్యలేం లేవు. దగ్గర ఉండి సెటిల్ చేశారంతే.

ప్రభుత్వ ఖజానాకు గండి..

జీడిపప్పు అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వ ఖజా నాకు గండిపడుతోంది. రూ.కోట్ల ఆదాయం పక్కదారి పడుతోంది. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై అక్రమాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. జిల్లాలో అధికారికంగా 49 జీడిపప్పు ప్రాసెస్ యూనిట్లు ఉన్నాయి. దేవరపల్లి, తాడిమళ్ల, దివాన్‌చెరువు తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. అనధికారి కంగా ఇంకో ఇన్ని ఉంటాయని సమాచారం. జిల్లా వ్యాప్తంగా 12 వేల హెక్టార్లలో జీడిమా మిడి తోటలు ఉన్నాయి. వీటి నుంచి ఏటా సుమారు 40 వేల టన్నుల జీడిపిక్కలు వస్తాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మోరి జీడిపప్పునకు ప్రసిద్ధి. కాకినాడ, అల్లూరు సీతారామరాజు జిల్లాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయి. రైతుల నుంచి జీడిపిక్కలను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. పన్ను ఎగ్గొట్టేందుకు అక్రమదారులు వెతుకుతారు. ఇతర రాష్ట్రాలకు, ఇతర ప్రాంతాలకు ప్రైవేట్ బస్సుల్లో లగేజీ పేరుతో రవాణా చేస్తుంటారు. దేవరపల్లి, నిడదవోలు, రాజమహే ంద్రవరం తదితర ప్రాంతాల్లో ఇది ఎక్కువ జరుగుతోంది. పోలీసు, రెవెన్యూ,జీఎస్టీ, మార్కెట్ కమిటీ అధికా రులకు ముడుపులు చెల్లించడం వల్ల అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.గతేడాది జిల్లాలో మార్కెట్ సెస్ కింద కేవలం రూ.34.50 లక్షల ఆదాయం వచ్చింది. ఎస్ జీఎస్టీ కింద సుమారు రూ.2.10 కోట్ల ఆదాయం వచ్చింది. అధికారులు సక్రమంగా దృష్టి పెడితే మరిన్ని కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుంది.

అడ్డదారిలో వచ్చి..

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం శివారు చిలకావారి పాకల సమీపంలో జీడిపిక్కలతో వస్తున్న డీసీఎంమినీ వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఏడుగురు కూలీలు అక్కడికక్కడే మృతిచెందా రు.ఈ ఘటనతో జీడిపిక్కల వ్యాపారుల అక్రమాలు చర్చనీయాంశ అయ్యాయి. ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలంలోని బొర్రం పాలెంనుంచి ఈ జీడిపిక్కల వ్యాన్ తూర్పుగోదావరి జిల్లాలోని నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి వస్తోంది. ఈ వ్యాన్ జంగారెడ్డిగూడెం నుంచి గోపాలపురం మీదుగా దేవరపల్లి , నల్లజర్ల నుంచి తాడిమళ్ల రావడానికి మంచి రహదారి ఉంది. కొయ్యలగూడెం నుంచి నల్లజర్ల మీదుగా రావడానికి రహదా రులు ఉన్నాయి. ఆయా దారుల్లో మార్కెట్ కమిటీ చెక్ పోస్టులు ఉన్నాయి. ఆ సెస్ ఎగ్గొట్టడానికి రాష్ట్ర హైవేలను వదిలేసి, అడ్డదారి ఎన్నుకున్నారు.ఇది చాలాకాలంగా నడుస్తున్నట్టు స్థానిక ప్రజలు చెబుతున్నారు. బొర్రం పాలెం నుంచి ప్రమాదం జరిగిన చిన్నాయిగూడెం చిలకావారి పాకల వద్దకు 35 కిలోమీటర్లు ఉంటుంది. ఇది తోటల మధ్య చిన్నచిన్న ఊర్ల నుంచి ఉన్న రహదారి. జీడిపిక్కలు, జీడిపప్పు వ్యాపారం చేసేవారు మార్కెట్ సెస్సు జీడిపిక్కల బస్తా ధరకు రూ.1 శాతం చెల్లిం చాలి. రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీ ఎస్‌టీ)కింద 18 శాతం చెల్లిం చాలి.ఈ పన్నులు ఎగ్గొట్టడానికి వ్యాపారులు ఇటువంటి అడ్డదారులు తొక్కు తున్నారు.ప్రమాదం జరిగిన రోడ్డు ఓ అడ్డదారే. ఇప్పుడు ఆ ఏడు కుటుంబాలకు దిక్కెవరు.

కేవలం రూ.2.60 లక్షల కోసమే..

డీసీఎం వ్యాన్‌లో 250 బస్తాలు ఉన్నాయి.ఒక్కో బస్తాలో 50 కేజీల జీడిపిక్కలు ఉన్నాయి. బస్తాలు మీద పడడంతో ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు.పన్ను ఎగగొట్టడం కోసమే వ్యాపారులు ఈ దారిని ఎన్నుకున్నారు. ఇక్కడ బస్తా కు 50 కేజీలు ఉన్నా పన్ను విధించేటప్పుడు బస్తాకు 80 కేజీల కింద లెక్కిస్తారు. 80 కేజీల ప్రకారం వ్యాన్‌లో 171.875 బస్తాలు ఉన్నాయి. ప్రస్తుతం బస్తా దర రూ. 13 వేలు వరకూ ఉంది. దీని ప్రకారం ఒక్కో బస్తాకు మార్కెట్ సెస్ కింద రూ.130 వంతున రూ.22,343 చెల్లిం చాల్సి ఉంది. అంతేకాక జీఎస్టీ 18 శాతం కింద ఒక్కో బస్తాకు రూ.1340 మొత్తం రూ.2,30,312 చెల్లించాలి. ఇది ఎగ్గొట్టడం కోసం అడ్డదారిలో వచ్చి ఏడుగురు ప్రాణాలు బలికొన్నారు. పైగా సీజన్‌లో ఈ దారిలో రోజుకు 50 నుం చి 60 వాహనాలు వెళతాయని సమాచారం. ప్రాసెస్ యూనిట్ల వద్ద కేజీ జీడిపప్పు రూ.600 వరకూ ఉంది. మార్కెట్‌లో రూ.800 నుంచి పైకి ఉంటుంది.

- యథేచ్ఛగా జీడిగింజల వ్యాపారం
- కోట్లాది రూపాయల లావాదేవీలు
- పన్ను ఎగ్గొట్టేందుకు ప్రయత్నాలు
- అడ్డదారుల్లో అక్రమంగా తరలింపు
- రూ.2.6 లక్షల కోసం దారి మళ్లింపు
- ఏడుగురిని బలిగొన్న ఘటన అదే
- పేద కుటుంబాలకు దిక్కెవరు
- పట్టని అధికార యంత్రాంగం
- మామూళ్ల మత్తులో జోగుతున్న వైనం
- జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశం

ఆగిన చెత్త సేకరణ వాహనాలు

- రూ.46 లక్షల బిల్లులు పెండింగ్
- 82 ప్రైవేట్ వాహనాలు నిలుపుదల
- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిన సేవలు
- 29 వాహనాలతో చెత్త సేకరణ
- రాజమహేంద్రవరంలో అపారిశుధ్యం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 12 : ఇంటింటా చెత్త సేకరణకు బ్రేక్ పడింది. యూజర్ చార్జీలు వసూళ్లను నిలుపుదల చేయడంతో రాజమహేంద్రవరంలో చెత్తసేకరణ వాహనాలు నిలిచిపోయాయి. ఫలితంగా చెత్త పేరుకుపోతుంది. గత ప్రభుత్వం చెత్తపై యూజర్ చార్జీలను వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డోర్ టూ డోర్ చెత్త సేకరణ ఉచితంగానే ప్రజలకు అందించే యోచనలో ఉంది. ఇప్పటికే రాజమహేంద్రవరంతో పాటు అన్ని ప్రధాన నగరాల్లో డోర్ టూ డోర్ చెత్త సేకరణకు సంబంధించి రాష్ట్రంలో రూ.36 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సదరు చెత్త తరలింపు ప్రైవేట్ వాహనాలు నిలిపివేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రూ.46 లక్షలు చెల్లించాల్సి ఉంది. యూజర్ చార్జీలు నిలిచిపోవడంతో బిల్లులు చెల్లింపులు జర గడంలేదు. ఇంటింటా చెత్త సేకరణకు 29 కార్పొరేషన్ వాహనాలు, 82 ప్రైవేట్ వాహనాలు వినియోగించే వారు. ప్రతిరోజు సగటున 162 మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. వీటిలో 82 వాహనాలు ఆగిపోయాయి. కార్పొరేషన్‌కు చెందిన 29 వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 26 సర్కిల్స్ పరిధిలో 50 డివిజన్లలో ఇంటింటా చెత్త సేకణ అంటే కత్తిమీద సాముగా మారింది. యూజర్ చార్జీల విధానం పునరుద్ధరించే అవకాశం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో డోర్‌టూడోర్ చెత్త తరలింపు పనులు నిలిచిపోయినట్టే. గతంలో ఇంటింటా రిక్షా ఉండేది. అలాగే పుష్ కార్టులను తిప్పేవారు. టాటా ఏస్ వాహనాలు తెచ్చాక వాటిని పక్కన పెట్టేశారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసినవి తుప్పుపట్టిపోయాయి. ఇప్పుడు డోర్‌టూడోర్ వాహనాలు నిలిచిపోవడంతో ఇంటింటా రిక్షాలు, పుష్ కార్టులను అధికారులు తెరపైకి తెస్తున్నారు. దీంతో పారిశుధ్యం మందకొడిగా సాగుతుంది. విధానాలు మార్చిన ప్రతిసారి నగరపాలక సంస్థకు లక్షలాది రూపాయల నష్టం జరుగుతుంది. ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకున్నాక మాత్రమే యాక్షన్‌లోకి రావాలి. రాజమహేంద్రవరంలో ఆకస్మాత్తుగా వాహనాలు నిలిచిపోవడంతో పారిశుధ్య సేవలు సన్నగిల్లాయి.నగరంలో చాలా వరకు చెత్త నుఇళ్లలో డస్ట్‌బిన్లలో నిల్వ చేసుకున్న ప్రజలు పారిశుధ్యకార్మికులు రాకపోవడంతో రోడ్డుపై పడేస్తున్నారు. నగరంలో పారిశుధ్యం గాడిన పడాలంటే సవాలే.

వరద బాధితులను ఆదుకోవాలి



ఎకరాకు రూ.25 వేల పరిహారమివ్వాలని డిమాండ్

రాజానగరం, సెప్టెంబరు 12 : ఏలేరు,బుడమేరు వరద బాధితులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఏలేరు ముంపు బాధితులను గురువారం పరామర్శించిన ఆమె మార్గమధ్యలో రాజానగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో భోజన విరామం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏలేరు రిజర్వాయర్ కెనాల్‌ను గతంలో సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నీట మునిగి వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఏలేరు కెనాల్‌కు మరమ్మతులు చేపట్టి ఆధునీకరణ చేయాలని గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే సంకల్పించి శంకుస్థాపన చేసి పనులు ఆరంభించినా ఈ రోజు వరకు పూర్తి కాలేదన్నారు. జగన్ ఐదేళ్లు, చంద్రబాబు పదేళ్లు సీఎంలుగా పనిచేసిన కాలంలో ఏ ఒక్కరూ తట్టెడు మట్టి తీసి పోసిన సందర్భాలు లేవన్నారు.ఒకరి మీద ఒకరు బురద జల్లుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపోయామని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ. 10 వేలు నష్ట పరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. కనీసం రూ.25 వేలు ఇవ్వకపోతే అప్పులు కూడా తీరవన్నారు. గత ప్రభుత్వంలో నష్ట పరిహారం చెల్లించలేదు. ఇప్పుడైనా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, మండల అధ్యక్షుడు ముప్పిడి శ్రీను, కార్యదర్శి అరిగెల అరుణ కుమారి, అమర జహా బేగ్, వైఏ వడయార్,జగతాశ్రీను,గరగ శ్రీధర్‌బాబుపాల్గొన్నారు.

సెబ్‌కి బై.. అబ్కారీకి సై

- 7 సెబ్ స్టేషన్లు..ఎక్సయిజ్‌గా మార్పు
- జిల్లా సెబ్‌లో 80 మంది సిబ్బంది
- వీరంతా మళ్లీ మాతృశాఖకు
- కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఆనందం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ.. శాఖలనూ కెలికిపడేసిన విషయం తెలిసిందే.ఈ జాబితాలో అబ్కారీ శాఖ మొదటి వరుసలో ఉంది.ఈ శాఖను కకావికలం చేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో(సెబ్) అంటూ సొంత లబ్ధి కోసం జగన్ ఓ కొత్త భూతానికి ఊపిరిపోశారు. తమ ఇబ్బందులను ఎక్సైజ్ శాఖ అధికారులు ఎన్నిసార్లు విన్నవించినా చెవిటి వైసీపీ ప్రభుత్వం చెవికెక్కలేదు. దీంతో ఐదేళ్లపాటు అబ్కారీ ఆవేదనను దిగమింగింది.ఈ బుధవారం నుంచి ఆ బాధకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది.వ్యవస్థలను ప్రక్షాళన చేసే పనిలో భాగంగా సెబ్ రద్దు చేస్తూ ఎక్సైజ్‌ని పునర్వవస్థీకరిస్తూ డీజీపీ, ప్రభుత్వ ఎక్స్అఫీషియో కార్యదర్శి సీహెచ్ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు 12 జీవోలను కూడా వెనక్కు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

మళ్లీ ఎక్సయిజ్ స్టేషన్లు

ఎన్నో ఏళ్ల నుంచీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ విధులు నిర్వర్తిస్తోంది. 2019లో జగన్ అధికారం చేపట్టిన తర్వాత ఈ శాఖను కకావికలం చేశారు. సొంత లబ్ధి కోసం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో(సెబ్)ని తెరపైకి తెచ్చారు. అబ్కారీ శాఖలోని 70 శాతం మంది సిబ్బందిని సెబ్‌కి కేటాయించి, వారికి బాస్‌గా పోలీసు ఉన్నతాధికారిని నియమించింది. ఎక్సైజ్ శాఖను కేవలం జగన్ నాసిరకం మద్యాన్ని విక్రయించడానికే పరిమితం చేసింది. దీంతో ఎక్సైజ్ శాఖ దాదాపుగా నిర్వీర్యం దశకు వచ్చేసింది. తమ ఇబ్బందులపై అబ్కారీ సిబ్బంది మొత్తుకున్నా వీసమెత్తు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనగ్ పిచ్చి పనులకు ఫుల్‌స్టాప్ పెట్టడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా సెబ్‌ని రద్దు చేసి ఎక్సైజ్‌ను పునర్వవస్థీకరిం చాలని గత నెల 28న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.ఇప్పుడు ఆదేశాలు వెలువడ్డాయి. ఎక్సైజ్ సిబ్బందిని వెంటనే ఆ శాఖకు వెనక్కు పంపాలని, సెబ్‌కు చెందిన స్టేషన్లు, ఫర్నిచర్, వాహనాలు, కంప్యూటర్లు, అద్దె భవనాలను అబ్కారీకి అప్పగించాలని, వివిధ కేసుల్లో జప్తు చేసిన వాహనాలు, సామగ్రిని కూడా బదలాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగానే ఎక్సైజ్ సిబ్బందిపై పోలీస్ అజమాయిషీ ఉండదు. ఆ సిబ్బంది అబ్కారీ కమిషనర్ నియంత్రణ, పర్యవేక్షణ పరిధిలోకి వస్తారు. ఐజీ ర్యాంకు అధికారి నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.జిల్లాలో రాజమహేంద్రవరంలోని సౌత్, నార్త్, కోరుకొండ, దేవరపల్లి, రంగంపేట, కొవ్వూరు, నిడదవోలులో ఉన్న సెబ్ పోలీస్ స్టేషన్లు ఇకపై ఎక్సైజ్ స్టేష న్లుగా మార్పు చెందనున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి సీఐ వరకూ 80 మంది సెబ్ పరిధిలో ఉన్నారు.మాతృశాఖకు రిపోర్టు చేయాలని జీవో వచ్చిన వెంటనే ఎక్షయిజ్‌కి వెళ్లడానికి ఆ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎక్సైజ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడవిలో చిరుత పులి

వారం రోజులుగా కొనసాగుతున్న వేట

8

నీట మునిగిన పంట భూముల పరిశీలన



తీపర్రులో అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శ్రీనివాస్

పెరవలి, సెప్టెంబరు 12: గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి ఎగువ ప్రాంతం నుంచి వరదతో ఒక్కసారిగా గోదావరి పెరగడంతో లంక భూముల్లో చాలా వరకు నీట మునిగాయి. అయితే గురువారం మధ్యాహ్నం నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టి నీరు వెనక్కి మళ్లింది. పల్లపు భూముల్లో మాత్రం నీరు అలాగే నిలిచి ఉంటుందని రైతులు చెబుతున్నారు. కొవ్వూరు ఉద్యాన అధికారి శ్రీనివాస్ కానూరు అగ్రహారం, తీపర్రు, ఉసులుమర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి తదితర గ్రామాల పరిధిలో నీట మునిగిన పంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. నీరు తగ్గిన వెంటనే అరటి, కూరగాయలు, తదితర పంటలకు సూక్ష్మపోషకాలు పిచికారీ చేసుకోవాలని దీని వల్ల మొక్కల్లో పెరుగుదల బాగుంటుందని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిడదవోలు, సెప్టెంబరు 12: నిడదవోలులో ఈ నెల 13న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. పట్టణంలోని మార్కెట్‌రోడ్డు, బస్టాండ్ ఏరియా, రైల్వేస్టేషన్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్‌రోడ్డు పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు. అలాగే మండలంలోని కాటకూటేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా తిమ్మరాజుపాలెం, లింగంపల్లి, శంకరాపురం, రావిమెట్ల గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ చెప్పారు.

దేవరపల్లి: దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ వీరభద్రరావు తెలిపారు.

రిసీట్స్, ఆధారాలు సబ్‌ట్రెజరీకి సమర్పించాలి

కొవ్వూరు, సెప్టెంబరు 12: కొవ్వూరు మండలంలో ట్రెజరీ ద్వారా ఫించన్లు పొందుతున్న పెన్షనర్లందరూ పాత ఇన్‌కమ్ ట్యాక్సు పద్ధతి ప్రకారం పొదుపు, గృహ రుణాలు ఎగ్జామ్స్ పొందదలుచుకున్న వారు ఈ నెల 20వ తేదీ లోపుగా మీ దగ్గర ఉన్న రిసీట్స్, ఆధారాల్ని సబ్‌ట్రెజరీ ఆఫీసులో సమర్పించాలని కొవ్వూరు పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎం. రామచంద్రరావు తెలిపారు. మరిన్ని వివరాలకు పెన్షనర్ల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు బిస్కెట్ల వితరణ



వరద బాధితుల విరాళాల సేకరణలో వాసవీక్లబ్ సభ్యులు

కొవ్వూరు, సెప్టెంబరు 12: వరద బాధితుల సహాయార్థం వాసవీక్లబ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలందిస్తోందని క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంటు బోడా ప్రకాష్ అన్నారు. గురువారం కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్ ఆర్థికసాయంతో రూ.25 వేలు విలువైన బిస్కెట్‌లు, కేక్‌లను కోనసీమ జిల్లా వాసవీ క్లబ్ గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్‌కు అందించారు. ప్రవీణ్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల సహాయార్థం రెండు వాహనాల్లో చీరలు, దుప్పట్లు, ఉపకరణాలు, పుస్తకాలు సేకరిస్తున్నామని ఈ క్రమంలో కొవ్వూరు వచ్చామన్నారు. కార్యక్రమంలో మద్దుల నాని, మట్టే ప్రసాద్, మద్దుల సత్యనారాయణ, దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

మలకపల్లిలో పౌష్టికాహార వారోత్సవాలు

తాళ్లపూడి, సెప్టెంబరు 12: మలకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పౌష్టికాహార వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భానుమతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ రాపాక రాజేశ్వరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ అన్నపూర్ణ రక్తహీనత, పౌష్టికాహార లోపంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించారు. అనంతరం పాఠశాలలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసవి, కార్యదర్శి కామేశ్వరి, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌ను బలపరచాలి



తాళ్లపూడి హైస్కూల్లో యూటీఎఫ్ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు జయకర్

తాళ్లపూడి, సెప్టెంబరు 12: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యూటీఎఫ్‌ను బలపరచాలని జిల్లా గౌరవాధ్యక్షుడు జయకర్ అన్నారు. గురువారం తాళ్లపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సభ్యత్వాల సేకరణ, 117 జీవో, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయులకు నెల వారీ పదోన్నతులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో రాజకుమారి, కృష్ణవేణి, శ్రీనివాస్, మనోజ్, విజయబాబు, క్రాంతికుమార్, ప్రసన్నకుమార్, పుల్లారావు, అక్కయ్య పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

చాగల్లు-నెలటూరు వర్తక సంఘం ఆధ్వర్యంలో చవితి ఉత్సవాలు



ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసిన కమిటీ సభ్యులు

చాగల్లు, సెప్టెంబరు 12: దాతలు అందించే ప్రోత్సాహకాలు విద్యార్థులకు మరింత స్ఫూర్తినిస్తాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గ్రంధి రాంబాబు అన్నారు. శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చాగల్లు-నెలటూరు వర్తక సంఘం కళావేదికపై ఉత్తమ విద్యార్థులకు మెడల్స్ నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. రాగిరెడ్డి మహీధర్, బొల్లా స్నేహ(పదో తరగతి)లకు మామిడి ఉప్పరకుమార్, ఈఈ నత్తా రాజేశ్వరరావు, మహ్మద్ ఆయేషా సిద్దిక్(ఇంటర్ ఫస్టియర్)కు దొడ్డా వెంకటరావు, కోడి లక్ష్మీలావణ్యకు(ఇంటర్ సెకండియర్)కు కోట సూర్యారావు ఆర్థిక సహకారంతో మెడల్స్, నగదు ప్రోత్సాహకాలు బహూకరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పీవీ సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, నల్లూరి అప్పారావు, లింగాల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, సెప్టెంబరు 12: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు హెడ్‌కానిస్టేబుల్ మోటూరి సత్యనారాయణ తెలిపారు. కొవ్వూరు మండలం పెనకనమెట్ట గ్రామానికి చెందిన గంటా చంద్రశేఖర సాయిరత్నారావు నందమూరులో భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గురువారం ఉదయం పొలంలో పని ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా మినీ బైపాస్‌లో టానిక్ బార్ సమీపంలో యువరాజ్‌మాల్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. రత్నారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

19న రేలంగి కాంస్య విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 12: రాజమహేంద్రవఋం గోదావరి గట్టుపై ఈ నెల 19వ తేదీన హాస్య నటచక్రవర్తి రేలంగి వెంకట్రామయ్య కాంస్య విగ్రహావిష్కరణ చేస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌కు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎస్పీని కలిసిన వారిలో కొండేటి భీమారావు, మార్గాని చంటిబాబు, అత్తిలి రాజు, ఒసుము శ్రీను, బొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రివిట్‌మెంటు వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- మద్దూరులంకలో వరద ఉధృతి, ఏటిగట్ల పరిశీలన



మద్దూరులంకలో ఏటి గట్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, సెప్టెంబరు 12: మద్దూరులంక గ్రామం చుట్టూ రివిట్‌మెంటు వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులకు చెప్పారు. గురువారం కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో వరద గోదావరిని, బలహీనంగా ఉన్న ఏటిగట్లను ఆయన పరిశీలించారు. వరద నీరు గ్రామంలోకి రాకుండా గ్రామం చుట్టూ రివిట్‌మెంటు వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పగా ఎంపీడీవో కె.సుశీల మాట్లాడుతూ గతంలో ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. అయితే రెవెన్యూ, మండల పరిషత్, ఇరిగేషన్ శాఖాధికారులతో కలిసి మరోసారి ప్రతిపాదనలు తయారుచేసి అందించాలని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మద్దూరు జడ్పీ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. పల్లిపాలెంలోని ముంపు ప్రాంతంలో నివసిస్తున్న 49 మందిని కలిసి పునరావాస కేంద్రంలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

ఎలుకల నివారణకు మందు పంపిణీ



ధర్మవరంలో ఎలుకల మందు పంపిణీ

కొవ్వూరు మండలం ధర్మవరంలో సామూహిక ఎలుకల నివారణలో భాగంగా సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఏవో ఎ.గంగాధర్ మాట్లాడుతూ 100గ్రా విషపు ఎరను తయారు చేసుకుని 10గ్రా. చొప్పన పొట్లాలుగా కట్టి సజీవ బొరియల వద్ద పెట్టాలని చెప్పారు. కార్యక్రమాల్లో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, సర్పంచ్ ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, నాయు డు వీర్రాజు, గారపాటి వెంకటకృష్ణ, ఇన్‌చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు, ఏజీఆర్‌టీ ఏఈ ఆర్.సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

- చిట్యాల 'పొలం బడి'లో జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



చిట్యాలలో ప్రయోగాత్మకంగా నాటిన వరిచేను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గోపాలపురం, సెప్టెంబరు 12: మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి ఖర్చు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన దిగుబడిని సాధించేందుకు శిక్షణ ఇవ్వడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మానుకొండ శ్రీనివాసరావు, నరసింహరావు బృందంతో కలిసి గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. దుబ్బు దశలో అక్కడక్కడ ఆకుముడత, కాండం తొలుచు పురుగులు, వర్షాల కారణంగా వాటి ఉధృతి గణనీయంగా తగ్గిందన్నారు. అనవసరంగా ఎటువంటి పురుగుమందులు పిచికారీ చేయవద్దని సూచించారు. ఏ పంటకు ఏ మందు వేయాలో వ్యవసాయాధికారులను సంప్రదించి వాటిని వినియోగించాలన్నారు. అధిక గాఢత ఉన్న మందులు పిచికారీ చేయడం ద్వారా మిత్రపురుగులు నశించి, శత్రు పురుగుల ఉధృతి పెరుగుతుందన్నారు.సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్యం పాటించి సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, కొవ్వూరు ఏడీఏ పీ.చంద్రశేఖర్, వ్యవసాయాధికారి రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వెంకటాయపాలెంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొవ్వాడ కాల్వ ముంపుకు గురైన పంటపొలాలను వారు పరిశీలించారు.

అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు, సెప్టెంబరు 11: కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు సీడీపీవో డి.మమ్మీ తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవం-1 (బీసీ-ఏ), వేములూరు-3(ఓపెన్ కేటగిరీ), మెహెర్‌బాబా గుడి 6వ వార్డు(ఓపెన్ కేటగిరీ), రామా సొసైటీ 18వ వార్డు(ఓపెన్ కేటగిరీ), పెనకనమెట్ట-3(ఓపెన్ కేటగిరీ), ఆరికిరేవుల-2 (బీసీ-డీ), చాగల్లు మండలం చాగల్లు-4 (బీసీ-బీ), చిక్కాల-4 (ఎస్టీ), నెలటూరు-1(ఓపెన్ కేటగిరీ)), గౌరిపల్లి (బీసీ-బీ),చంద్రవరం-2(బీసీ-ఇ), తాళ్లపూడి మండలం మలకపల్లి-3 (ఎస్సీ)లకు కేటాయించినట్టు చెప్పారు. అర్హులైన వారు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు కొవ్వూరు సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు నివాస, కులం, విద్యార్హత పత్రాలను అందజేయాలన్నారు. ఏ అంగన్వాడీ కేంద్రానికి దరఖాస్తు చేసేది తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గంలోని ఆయా పోస్టులు చాదరాశికుంట(బీసీ-బీ), హుకుంపేట(ఓపెన్), యర్నగూడెం(ఓపెన్), నబీపేట(ఎస్సీ), గౌరిపట్నం(ఓపెన్), వేళ్లచింతలగూడెం(బీసీ-ఏ), నల్లజర్ల(ఓపెన్) ఉండగా చాదరాశికుంటలో ఓపెన్ కేటగిరీలో కార్యకర్త పోస్టు ఉందని గోపాలపురం సీడీపీవో నాగలక్ష్మి పేర్కొన్నారు. పోస్టులకు అర్హులైన వారు ఈనెల 20 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

వినాయకుడికి ఘనంగా పూజలు



దేవరపల్లిలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, సెప్టెంబరు 12: దేవరపల్లిలో గణపతి నవరాత్రుల సందర్భంగా మెరక వీధి వినాయకుడి ఆలయం వద్ద ద్వారకా రెసిడెన్సీ ఆధ్వర్యంలో గురువారం పూజలు నిర్వహించారు. గణనాథుడికి వివిధ రకాల పిండివంటలు, స్వీట్లు, పండ్లు, పువ్వులు, పత్రులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెరవలిలో గణపతి ఊరేగింపు



పెరవలి, సెప్టెంబరు 12: మండలంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం పెరవలిలో పోలేరమ్మ యూత్ ఆధ్వర్యంలో ఊరే గింపు నిర్వ హిం చారు. స్వామివారిని సాంప్రదాయ నృత్యాలతో గ్రామమంతా ఊరేగించారు. అలాగే తీపర్రులో బాల గణపతి ఆలయం వద్ద లడ్డూ వేలం నిర్వహించగా ఈర్పిన వెంకటేశ్వరరావు రూ.20 వేలకు దక్కించుకున్నారు.

నల్లజర్లలో గణేశుడి నిమజ్జనం



నల్లజర్ల, సెప్టెంబరు 12: నల్లజర్ల డాల్ఫిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి యూత్ యూనిఫాం ధరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తి గీతాలతో మేళతాళాలతో గ్రామ పుర వీధుల్లో స్వామి వారిని ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు.

వరద తగ్గే వరకూ నిమజ్జనాలు చేయొద్దు

ఎస్ఐ రామకృష్ణ



తాళ్లపూడి, సెప్టెంబరు 12: గోదావరి నదిలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడం వల్ల గణపతి నిమజ్జనాలు ఆపాలని ఉత్సవ కమిటీలకు ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. నదిలో స్నానాలు చేయడం, చేపల వేటకు వెళ్లడం నిషేధించామని, వరద ఉధృతి తగ్గిన తర్వాత నిమజ్జనాలు చేసేవారు పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పారు.

మద్దూరులో అశ్లీల నృత్యాలు..12 మందిపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 12: వినాయక చవితి వేడుకల్లో భాగంగా అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తున్న 12 మందిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి తెలిపారు. కొవ్వూరు మండలం మద్దూరులోని బీసీ కాలనీలో బుదవారం రాత్రి అశ్లీల నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేశారు. విషయం తెలుసుకున్న కమిటీ సభ్యులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో తప్పించుకుని వెళ్తున్న డాన్సర్ల బృందాన్ని, సౌండ్ సిస్టమ్, ఆటోను రాత్రి 1 గంట సమయంలో పట్టుకున్నారు. డాన్సర్ల బృందాన్ని, సౌండ్ సిస్టమ్ యజమాని, కమిటీ సభ్యులు 13 మందిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పాల ఉత్పత్తిదారుల దాతృత్వం

విజయ డెయిరీకి రూ.10 లక్షల విరాళం



సమావేశంలో మాట్లాడుతున్న గంటా నాగేశ్వరరావు

నల్లజర్ల, సెప్టెంబరు 12: కృష్ణ మిల్క్ యూనియన్(విజయ డెయిరీ)కు బుడమేరు వాగు వల్ల ముంపుకు గురై రూ.70 కోట్లు నష్టం జరిగిందని, ఇప్పటివరకు తమను ఆదరించిన విజయ డెయిరీని ఆదుకునేందుకు జిల్లాలోని పాల ఉత్పత్తిదారుల రూ.10 లక్షల విరాళం ప్రకటించినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాల ఉత్పత్తిదారుల అసోషియేషన్ అధ్యక్షుడు గంటా నాగేశ్వరరావు అన్నారు. గురువారం నల్లజర్లలోని యూనియన్ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విజయ డెయిరీ ద్వారా రైతులకు ప్రతి నాలుగు నెలలకు బోనస్ పంపిణీ, వెటర్నరి సర్వీస్, ఇన్సురెన్సు, సెమన్ సర్వీసు, కల్యాణమస్తు, క్షీర బంధు వంటి పథకాల ద్వారా ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ప్రతి రోజు జిల్లాలో 50వేల లీటర్ల పాలు సేకరిస్తోందన్నారు. కార్యక్రమంలో ముసుళ్లకుంట, పుల్లలపాడు, నల్లజర్ల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు నందమూరి రామకృష్ణ, అల్లూరి దుర్గారావు, యలమాటి ఆనంద్, మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా మధు



పెరవలి, సెప్టెంబరు 12: సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు సంబంధించి కొవ్వూరు విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ మెంబర్‌గా బావన మధు నియమితులయ్యారు. సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవ తనను నియమించినట్టు ఆయన తెలిపారు. సోషల్ వెల్ఫేర్ కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షిస్తానని చెప్పారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ..ఇద్దరికి గాయాలు



దేవరపల్లి, సెప్టెంబరు 12: అంబులెన్స్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. గురువారం బెంగుళూరు నుంచి విశాఖపట్నం అంబులెన్స్‌లో పేషెంట్‌ను తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో దేవరపల్లి మండలం యర్నగూడెం జాతీయ రహదారిపై లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్‌కు, క్యాబిన్‌లో ఉన్న మరో వ్యక్తికి స్వల్పగాయాలవ్వడంతో హైవే అంబులెన్స్‌లో వారిని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారు వెళ్లిపోయారని దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

బస్సు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలు



దేవరపల్లి, సెప్టెంబరు 12: ఆర్టీసీ బస్సు ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన దేవరపల్లి మండలం యర్నగూడెంలో గురువారం జరిగింది. ఏలూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు దేవరపల్లి నుంచి యర్నగూడెం వైపు వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను ఢీకొనడంతో గ్రామానికి చెందిన గాడి శ్రీను తలకు బలమైన గాయమైంది. దీంతో అతడిని గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అపై మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి : కలెక్టర్

తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయం సందర్శన



తహశీల్దార్ రవీంద్రనాథ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి,సెప్టెంబరు 12: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సకాలంలో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించి,కార్యాలయ రికార్డులను పరిశీలించారు. కార్యాలయం పరిధిలో మ్యుటేషన్‌కు సంబంధించిన రికార్డులు పెండింగ్‌లో ఉండడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తోన్న పీజీఆర్ఎస్‌కు వస్తున్న అర్జీల పరిష్కార స్థాయిపై దృష్టి పెట్టాలని, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. స్వచ్ఛతా సేవ-2024 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకూ మూడు కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే క్రమంలో మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటిస్తామని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వరద ఉధృతంగా ఉండడంతో ప్రతి ర్యాంపు వద్ద హెచ్చరిక నోటీసులు పెట్టాలని తహశీల్దార్ రవీంద్రనాథ్‌కు చెప్పారు. వినాయక చవితి మండపాలు ఎన్ని ఉన్నాయో అడిగి ఉధృతి తగ్గే వరకూ నిమజ్జనాలు ఆపాలని చెప్పారు. అనంతరం కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగు తడబడితే.. బతుకు గోదారే!

రైల్వే అధికారులూ ఇది సబబేనా?



ఈ ఫొటోలు చూస్తే వామ్మో.. అనిపిస్తోందా?.. కింద ఉగ్ర గోదావరి, పైన ఫుట్‌పాత్ అంచున పనులు.. కచ్చితంగా గుండె ఝల్లు మంటుంది. రెక్కాడితేగానీ డొక్కాడని ఈ జీవులు పనిలో నిమగ్నమై అడుగు తడబడితే బతుకు గోదారిలో కలిసిపోతుంది. కుటుంబం అనాథగా రోడ్డున పడుతుంది. రోడ్డు కం రైలు బ్రిడ్జిపై పాత సిమెంట్ రెయిలింగ్ తీసేసి కొత్తగా ఇనుప రెయిలింగ్ ఏర్పాటు చేసే పనులను రైల్వే బ్రిడ్జిల విభాగం ఆధ్వర్యంలో చేస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. 11న రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ అయ్యింది. గణేష్ నిమజ్జనాలను వాయిదా వేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కానీ ఇవేమీ రైల్వే అధికారులకు కానరాలేదు. ఇన్నాళ్లూ వదిలేసి ఇప్పుడే మూహూర్తం అన్నట్లుగా కనీసం రక్షణ చర్యలు తీసుకోకుండా పనులు చేయిస్తున్నారు. సిమెంటు రెయిలింగ్ పిల్లర్లను గ్యాస్ కట్టర్‌తో తొలగించే పనిని ఇద్దరు వ్యక్తులు చేస్తున్నారు. ఏ మాత్రం ఆదమరుపుగా అడుగు ముందుకు పడినా, దిమ్మెను గోదావరిలోకి తోసే క్రమంలో తూలినా ప్రాణాలు జలసమాధి అయిపోతారు. ఇంతటి ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న వీళ్లను చూస్తూ అటుగా వెళ్లే జనం అయ్యో అనుకుంటూ.. బడుగు జీవుల బతుకులంటే అంత చులకనా? అంటూ రైల్వే అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

అటవీ ప్రాంతంలోనే చిరుత పులి

జిల్లా అటవీశాఖాధికారి భరణి





థర్మల్ డ్రోన్ కెమెరా

దివాన్‌చెరువు, సెప్టెంబరు 12: దివాన్‌చెరువు అటవీ ప్రాంతాల్లో అమర్చిన ట్రాప్ కెమెరాలో బుధవారం(11న) చిరుతపులి కదలిక చిత్రాలు కనబడ్డాయని, ప్రస్తుతం అది దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోనే ఉందని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి గురువారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. చిరుతపులి పాదముద్రను కనుగొని పగ్ ఇంప్రెషన్ ప్యాడ్‌లు (పీఐపీ) తీసుకున్నామన్నారు. పులి కదలికలను గుర్తించే నిమిత్తం సీసీ కెమెరాలు, ట్రాప్ కెమెరాలను కొన్ని ప్రదేశాల్లో అమర్చామన్నారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అన్ని నివాస ప్రాంతాలను సిబ్బంది క్రమం తప్పకుండా శోధిస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం తీసుకుని వెళ్లి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ లేదని స్పష్టంగా పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి థర్మల్ డ్రోన్ కెమెరాను ఉపయోగించి శోధన కూడా ప్రారంభించినట్టు తెలిపారు. చిరుతపులి కదలికల కారణంగా దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న రాజమహేంద్రవరంలోని లాలాచెరువు-హౌసింగ్‌బోర్డు వద్ద నుంచి ఆటోనగర్ వరకూ జాతీయ రహదారిపై వాహన ప్రయాణికులు నెమ్మదిగా గమనిస్తూ ప్రయాణించాలని కోరారు. దివాన్‌చెరువు అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న జాతీయ రహదారికి సంబంధిత అధికారులను కలసి జాతీయ రహదారిపై స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయించినట్టు డీఎఫ్‌వో భరణి తెలిపారు.

తగ్గుతున్న ఉధృతి

ధవళేశ్వరం, సెప్టెంబరు 12: గోదావరి ఉధృతి తగ్గుముఖం పడుతుంది. ధవళేశ్వరం వద్ద బుధవారం రాత్రి 11గంటలకు 15.30అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం 8గంటల పాటు నిలకడగా ఉంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి అత్యధికంగా 15,33,399 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. గురువారం ఉదయం 8గంటల నుంచి నీటి మట్టంలో తగ్గుదల నమోదయింది. నెమ్మదిగా తగ్గుతున్న నీటిమట్టం 10గంటల వ్యవధిలో 9పాయింట్ల మేర తగ్గి సాయంత్రం 6గంటలకు 14.50 అడుగులకు చేరుకుంది. 13,92,111క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తోంది. రెండో ప్రమాదహెచ్చరిక కొనసాగుతోంది. ఎగువన భద్రాచలం వద్ద నెమ్మదిగా తగ్గుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రం 6గంటలకు 41.50 అడుగులుగా నమోదయింది.